Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 177 మేడ్చల్ మల్కాజ్‌గిరి 18 జూలై 2023 మంగళవారం పేజీలు : 4

### నేడు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ప్రతిరోజూ మారుతుంటాయన్న విషయం తెలిసిందే. కానీ ఏంటిది? రెండు రోజుల క్రితం బంగారం, వెండి ధరలు కొండెక్కి కూర్చొని దిగి రానంటున్నాయి. బంగారం ధర కాస్త తగ్గుతుందని ఆశించిన వారికి నిరాశే ఎదురవుతోంది. నిజానికి బంగారం చాలా గ్యాప్ తీసుకుని పెరిగింది. ఇక రెండు రోజులుగా అక్కడే స్థిరంగా ఆగిపోయింది. నేడు 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55 వేలకు చేరుకోగా.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60 వేలకు చేరుకుంది. ఇక కిలో వెండి ధర రూ.77,500కు చేరుకుంది. నేడు దేశ వ్యాప్తంగా బంగారంధరలు ఎలా ఉన్నాయో చూద్దాం. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,000.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,000 విజయవాడలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,000.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,000.



# మరాఠా గడ్డపై గులాబీ జెండా ఎగరాల్సిందే!

## 30న సోలాపూర్‌లో సభ

## డిసైడైపోయిన 'కారు సారు'

హైదరాబాద్ : మహారాష్ట్రలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యకలాపాలను వేగవంతం చేసిన ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నెలాఖరులోగా సోలాపూర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 30న బహిరంగ సభ నిర్వహించేందుకు సభాస్థలిని ఎంపిక చేయాల్సిందిగా స్థానిక బీఆర్ఎస్ నేతలను ఆదేశించారు. సభ నిర్వహణ ఏర్పాట్లపై మహారాష్ట్ర బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ తాజాగా చర్చించినట్లు తెలిసింది. పార్టీ బలప్రదర్శనకు అద్దం పట్టేలా కనీసం 2 లక్షల మందిని ఈ సభకు సమీకరించాలని లక్ష్యం నిర్దేశించారు. సభ నిర్వహణ ఏర్పాట్ల బాధ్యతను మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలోని బృందానికి అప్పగించాలని నిర్ణయించారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్, పార్టీ నేత ఎస్.వేణుగోపాలాచారి తదితరులకు సమన్వయ బాధ్యతలు అప్పగించారు. ఈ నెల 20 తర్వాత మంత్రి హరీశ్‌రావు సోలాపూర్‌లో సభాస్థలిని పరిశీలించి స్థానిక బీఆర్ఎస్ నేతలతో సభ ఏర్పాట్లపై చర్చిస్తారు. సుమారు వారంపాటు పార్టీ నేతలతో కలసి సోలాపూర్‌లోనే మకాం వేసి సభ ఏర్పాట్లు, జన సమీకరణ తదితరాలను పర్యవేక్షిస్తారు.

**బీఆర్ఎస్‌లోకి ముగ్గురు ఎన్సీపీ ఎమ్మెల్యేలు?** : సోలాపూర్‌లో జరిగే బహిరంగ సభా వేదికగా ఎన్సీపీకి చెందిన ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలతోపాటు ఓ మాజీ ఎంపీ, వివిధ పార్టీలకు చెందిన నేతలు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. శివసేన, ఎన్సీపీలో చీలిక, కాంగ్రెస్‌లో నిస్తేజం వంటి పరిణామాలు వివిధ పార్టీల నేతలు బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపేందుకు దోహదం చేస్తున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అయితే బీఆర్ఎస్‌లో చేరే ముగ్గురు ఎన్సీపీ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు పూర్తయ్యాయని, వారి చేరికలకు సంబంధించి కేసీఆర్ వివరాలు వెల్లడిస్తారని మహారాష్ట్ర బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. 2024లో జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 288 అసెంబ్లీ స్థానాలతోపాటు స్థానిక సంస్థల్లోనూ పోటీ చేస్తామని కేసీఆర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు వివిధ పార్టీల్లో కీలక పదవుల్లో నేతలు బీఆర్ఎస్‌లో చేరుతు న్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొద్ది ఓట్ల తేడాతో ఓడిన వివిధ పార్టీ ల నేతలు ఇప్పటికే బీఆర్ఎస్‌లో చేరగా వారిలో పలువురు మాజీ ఎ మ్మెల్యేలు కూడా ఉన్నారు. ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన సోలాపూర్‌కు చెందిన బీజేపీ కార్పొరేటర్లు నగేశ్ వల్యాల్, జుగన్‌భాయ్ అంబేవాలే, సంతోష్ బోంస్లే 30న జరిగే బహిరంగ సభలో కీలకపాత్ర పోషించనున్నారు.

**సోలాపూర్‌పై పట్టు సాధించేందుకు** : మహారాష్ట్రలోని మరాఠ్వాడ, విదర్భ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించిన కేసీఆర్... నాందెడ్, ఔరంగాబాద్, నాగపూర్‌లలో సభలు, సమావేశాలు నిర్వహించారు. అలాగే గత నెలలో సోలాపూర్‌లో రెండ్రోజులు పర్యటించారు.

30న నిర్వహించే భారీ సభ ద్వారా సోలాపూర్‌తోపాటు కొల్లాపూర్, సాంగ్లి, ఉస్మానాబాద్, బీడ్ తదితర ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేయాలని భావిస్తున్నారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లోకి బిగ్ షాట్స్...

హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ఏడాదిలోకి ప్రవేశించింది తెలంగాణ. దీనికి సంబంధించిన వేడి రాజుకుంటోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడటానికి ఇక ఎంతో సమయం లేదు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఈ నేపథ్యంలో అధికార భారత్ రాష్ట్ర సమితి.. హ్యాట్రిక్‌పై గురి పెట్టింది. వరుసగా మూడోసారి అధికారంలోకి రావడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటోంది. అదే సమయంలో కాంగ్రెస్ జూలు విదిలిస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారంలోకి వచ్చేలా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకుంటోంది. బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయాన్ని నిలువరించడానికి సర్వశక్తులను ఒడ్డుతోంది. కర్ణాటక ఫార్ములాను అనుసరించేలా వ్యూహాలపై కసరత్తు సాగిస్తోంది తెలంగాణ కాంగ్రెస్ పార్టీ. ఈ క్రమంలో చేరికలకూ అధిక ప్రాధాన్యత ఇస్తోంది. తాజాగా కాంగ్రెస్ కండువాను కప్పుకోవడానికి మరికొందరు నాయకులు క్యూలో ఉన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తెలంగాణ కాంగ్రెస్‌కు కొండంత బలాన్ని ఇచ్చింది. అధికార బీఆర్ఎస్, భారతీయ జనతా పార్టీల్లో ఇమడలేకపోతున్న సీనియర్లు- ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ వైపు చూపులు సారిస్తోన్నారు. బండి సంజయ్‌ని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించడాన్ని జీర్ణించుకోలేకపోతున్న కొందరు నాయకులు పార్టీ ఫిరాయించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి.. బీజేపీకి గుడ్‌బై చెప్పడానికి సిద్ధపడినట్లు సమాచారం. వారిద్దరూ కూడా కాంగ్రెస్ వైపు చూపులు సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఏనుగు రవీందర్‌రెడ్డి తెలంగాణ ప్రదేశ్



కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో భేటీ అయినట్లు వార్తలొచ్చాయి. ఇక యెన్నం శ్రీనివాసరెడ్డి కూడా జూపల్లి కృష్ణారావుతో చర్చలు జరిపినట్లు చెబుతున్నారు. అవి ఓ కొలిక్కి వచ్చిన వెంటనే ఏనుగు రవీందర్ రెడ్డి, యెన్నం.. కాంగ్రెస్ కండువాను కప్పుకోవడం లాంఛనప్రాయమే.




మంత్రి కేటీఆర్ మరోసారి మానవత్వం చాటుకున్నారు. మెదక్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడగా.. అటుగా వెళ్తున్న ఆయన.. క్షతగాత్రుడ్ని తన కాన్వాయ్‌లో ఆస్పత్రికి తరలించారు. చేగుంట మండలం రెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారిపై బస్సు-కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించి తన కాన్వాయ్‌ని ఆపారు. తన వెంట ఉన్న వైద్యుడితో బాధితుడికి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గాయపడ్డ వ్యక్తిని తన కారులో హైదరాబాద్‌కు తరలించారు.

# రైతు సంక్షేమమే ధ్యేయంగా....!





## ఎన్నికల వేళ కొత్త వ్యూహం..!!

హైదరాబాద్ : తెలంగాణలో రైతులకు అన్ని రకాలుగా మద్దతుగా నిలుస్తామని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేస్తున్నారు. తమ పార్టీ ఫిలాసఫీలోనే రైతు సంక్షేమం ఉందని గుర్తు చేస్తున్నారు. ఉచిత విద్యుత్ పైన వివాదం వేళ కాంగ్రెస్ నేతలు తమ పార్టీ రైతుల కోసం తీసుకున్న నిర్ణయాలను గుర్తు చేస్తోంది. ఉచిత విద్యుత్ తొలిగా అమల్లోకి తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని చెబుతున్నారు. పొలం పారటానికి ఉచిత విద్యుత్ మాత్రమే కాదు..దుక్కి దున్నడానికి భూమి ఇచ్చింది కూడా కాంగ్రెస్సేనని చెప్పుకొచ్చారు. తెలంగాణలో ఎన్నికల వేడి పెరిగింది. బీఆర్ఎస్ కాంగ్రెస్ ను ఉచిత విద్యుత్ విషయంలో దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేసింది. దీనికి కాంగ్రెస్ తిప్పి కొడుతోంది. అసలు రైతు రుణమాఫీ దేశ వ్యాప్తంగా అమలు చేసిన చరిత్ర కాంగ్రెస్ సొంతమని..ఉచిత విద్యుత్ తొలిగా అమల్లోకి తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తు చేస్తున్నారు. రైతులు, మహిళలు, దళితులు, బీసీలు ఇలా అందరి సంక్షేమం మొదలైంది కాంగ్రెస్ హాయంలో..పక్కాగా కొనసాగించేది కాంగ్రెస్ ప్రభుత్వంలోనేనని నినదిస్తున్నారు. అన్ని వర్గాల కోసం కాంగ్రెస్ అమలు చేసిన ఆ స్కీంలే కాపీ కొడుతూ బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేసుకుంటున్నారని..ఇప్పుడు బీఆర్ఎస్ చేస్తోంది అదనని ఆరోపిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు రుణమాఫీ ఇప్పటి వరకు అమలు చేయలేదనేది కాంగ్రెస్ ఆరోపణ. మభ్య పెట్టే మాటలు..ప్రచార ఆర్భాటాలతో ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని కాంగ్రెస్ నేతలు వరుస ఆరోపణలు చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రకటించిన రైతు డిక్లరేషన్ కు పార్టీ కట్టుబడి ఉంటుందని చెబుతున్నారు. తెలంగాణలో ఎక్కడ రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందుతోందని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. సవాళ్లు చేస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి సమాధానం లేదు. రైతలుకు దుక్కి దున్నటానికి భూములు ఇచ్చింది కాంగ్రెస్. రైతులకు సీలింగ్ యాక్ట్ కింద భూమిని పంచింది కాంగ్రెస్ పార్టీ. ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వేదిక పైనే కాంగ్రెస్ సీఎంగా వైఎస్సార్ ఉచిత విద్యుత్ పైన తొలి సంతకం చేసారని పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. మహిళలు..దళితులు..విద్యార్థుల సంక్షేమానికి కాంగ్రెస్ తీసుకొచ్చిన స్కీంలే నేటికి అమలు అవుతున్నాయని నేతలు వివరించారు. పేదలకు ఆరోగ్య శ్రీ తో కార్పోరేట్ వైద్యం కాంగ్రెస్ విధానం. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్ మెంట్ కాంగ్రెస్ కమిట్మెంట్ గా పేర్కొన్నారు. కాంగ్రెస్ అమలు చేసిన పథకాలనే తప్పని పరిస్థితుల్లో అమలు చేస్తూ తన గొప్పతనం గా ప్రచారం చేసుకుంటున్నారని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. తెలంగాణ ఏర్పడి దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నా.. రైతులకు చేస్తామని చెప్పిన రుణమాఫీ ఇప్పటికే అమలు కాలేదని నిలదీస్తున్నారు. సంక్షేమం కాంగ్రెస్ పేటెంట్ గా పేర్కొంటున్న నేతలు.. రైతుకు నాడు..నేడు ఏనాడైనా అండగా నిలిచేది కాంగ్రెస్ నినాదంతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు.

# సంపాదకీయం

## ఎంఎల్ఏ ఫైల్స్ రెడీ చేస్తున్నదా ?

తెలంగాణా బీజేపీకి అర్జెంటుగా ఒక సమస్య వచ్చి పడింది. అదేమిటంటే తన శీల పరీక్షను నిరూపించుకోవాల్సి రావటం. బీజేపీని బీఆర్ఎస్ కు బీ టీమని రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం జరిగిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అండ్ కో పదేపదే ఆరోపిస్తున్నారు. తాజా రాజకీయ పరిణామాల్లో జనాలు ఆ ఆరోపణలను నిజమే అని నమ్ముతున్నారు. కారణం ఏమిటంటే ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో కీలకసూత్రదారి అయిన కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్టు చేయకపోవటమే. కాంగ్రెస్ ఆరోపణలకు రెండుపార్టీల నుండి ఎలాంటి సమాధానం రావటంలేదు. ఖమ్మం పర్యటనలో ఇదే విషయాన్ని రాహుల్ గాంధి ప్రస్తావిస్తు బీఆర్ఎస్ బీజేపీ పార్టీలు ఒకటే అని అన్న విషయం తెలిసిందే. దీంతో బీజేపీ గ్రాఫ్ బాగా పడిపోయింది. మరి గ్రాఫ్ ను లేపాలంటే ఏమిచేయాలి ? అర్జంటుగా తన నిజాయితీని నిరూపించుకోవాలి. అందుకనే తొందరలోనే బీఆర్ఎస్ ఎంఎల్ఏ ఫైల్స్ ను రిలీజ్ చేయటానికి ప్లాన్ చేసిందట. బీఆర్ఎస్ లోని అవినీతి ఎంఎల్ఏల చిట్టాను బీజేపీ రెడీచేస్తోందట. ఇప్పటికే చాలామంది ఎంఎల్ఏలు ఎంపీలు ఎంఎల్సీల జాబితాలను రెడీచేసినట్లు కమలనాదులు చెబుతున్నారు. 2014 2018 2019 ఎన్నికల్లో ఎంఎల్ఏలు ఎంపీ అభ్యర్థులతో పాటు ఎంఎల్సీలు ఎన్నికల కమీషన్ కు అందించిన అఫిడవిట్లను ఇప్పటికే సేకరించి పెట్టుకున్నదట. వీళ్ళు ఎన్నికల్లో పార్టిసిపేట్ చేయక ముందు వీళ్ళ ఆర్ధిక పరిస్ధితి ఏమిటి గెలిచిన తర్వాత పరిస్ధితి ఏమిటనే కంపేరిజన్ కోసం అఫిడవిట్లను తీసుకుని పెట్టుకున్నదట. కంపేరిటివ్ స్టడీ కోసం వీళ్ళు ప్రతి ఏడాది దాఖలు చేస్తున్న ఇన్ కమ్ ట్యాక్స్ రిటర్న్ ను కూడా తీసుకుని పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఐటి రిటన్స్ తో పాటు ఎన్నికల కమీషన్ కు అందించిన అఫిడవిట్లో చూపించిన ఆస్తులు అప్పుల ద్వారా ప్రజా ప్రతినిధుల అవినీతి చిట్టాతో ఎంఎల్ఏ ఫైల్స్ న రెండీ చేసిం దని సమాచారం. ఎన్నికల నోటిఫికేషన్ రాగానే ఎంఎల్ఏల ఫైల్స్ విడుదల య్యేట్లుగా ప్లాన్ చేస్తోంది. కరపత్రాలు వాల్ పోస్టర్లు కటౌట్ల రూపంలో అవినీతి చిట్టాను వాళ్ళ నియోజ కవర్గాల్లో గ్రామస్ధాయిలో ప్రచారం చేయటానికి రెడీ అవుతోంది. మరి చివరకు ఏమి జరుగుతుందో చూడాల్సిందే.

# అక్రమార్కులకే ఖనిజ సంపద



జయశంకర్ : జిల్లాలో అడవులు, గోదావరి లాంటి సహజ వనరులతో పాటు.. బొగ్గు, లాటరైట్, డోలమైట్, ఐరన్ ఓర్, లాంటి ఖనిజ సంపద అపారంగా ఉంది.. సింగరేణి బొగ్గు, టీఎస్ఎండీసీ ద్వారా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. వాటితో ప్రభుత్వానికి రూ.కోట్లల్లో ఆదాయం సమకూరుతోంది. కాని లాటరైట్, డోలమైట్, ఐరన్ ఓర్ ఖనిజాలున్నా వెలికితీయడంలో ప్రయత్నాలు ముందుకు సాగడం లేదు. పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే యువతకు ఉపాధి, ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

ఖనిజ నిక్షేపాలిలా..జిల్లాలోని రేగొండ, గణపురం, టేకుమట్ల, చిట్యాల మండలాల్లో లాటరైట్, డోలమైట్, ఐరన్ ఓర్ నిక్షేపాలున్నాయి. చిట్యాల, టేకుమట్ల సరిహద్దులో వెలిశాల గుట్టల సమీపంలో, రేగొండ-ములుగు మండల సరిహద్దులో, గణపురం మండలం గాంధీనగర్, తదితర ప్రాంతాల్లో ఉన్నాయి. కానీ, వాటిని వెలికి తీయకపోవడంతో వృథాగా పోతున్నాయి. అక్రమార్కుల పరం అవుతున్నాయి.

పదేళ్ల కిందట తవ్వకాలు..

పదేళ్ల క్రితం చిట్యాల మండల పరిధిలోని గుట్టల్లో రెండు ప్రైవేటు కంపెనీలు ఐరన్ఓర్ కోసం తవ్వకాలు చేపట్టాయి. కొంతమేర నిక్షేపాలను తవ్వి తరలించారు. ఆ తర్వాత తవ్వకాలను నిలిపివేశాయి. ఇప్పటికీ అక్కడ తవ్వకాలు జరిపినట్లు ఆనవాళ్లున్నాయి. మట్టి, ఖనిజాలను వేరుచేసే యంత్రాలు, కార్మికులు ఉండేందుకు భవనాలు, వేబ్రిడ్జి, తదితర నిర్మాణాలు అక్కడున్నాయి. కానీ కొన్నాళ్లకే ఆ గనులు మూతపడ్డాయి. తిరిగి అక్కడ తవ్వకాలు చేపట్టలేదు. ఇక్కడ విలువైన ఖనిజ సంపద ఉందని తెలుసుకుని కొందరు గుట్టలకు పట్టాలు చేసుకున్నారు. అటవీ, రెవెన్యూ, ప్రైవేటు చేతుల్లో ఇక్కడి భూములున్నాయి. కానీ గనుల ఏర్పాటుకు మాత్రం అడుగులు పడటం లేదు.వెలికితీస్తే ఉపాధి..

ప్రభుత్వమే చొరవ తీసుకుని గనులు ఏర్పాటు చేస్తే ఆదాయం సమకూరుతుంది. ఇక్కడ స్థానికులకు ఉపాధి లభిస్తుంది. గనులు ఏర్పాటు చేస్తే సీనరేజీతో మరితం ఆదాయం లభిస్తుంది. ఆదాయాన్ని జడ్పీ, మండల, పంచాయతీలకు 50:25:25 నిష్పత్తిగా కేటాయిస్తారు. దీంతో జిల్లా అభివృద్ధికి దోహదం చేస్తుంది. ప్రస్తుతం జిల్లాలోని 10 ఇసుక రీచులు, 4 లాటరైట్ గనులు, 6 బొగ్గు గనులకు అనుమతులు ఉన్నాయి. ఒక క్యూబిక్ మీటర్ ఇసుకకు రూ.40 చొప్పున, ఒక టన్ను లాటరైట్‌కు రూ.100 చొప్పున సీనరేజీ ఛార్జీల కింద గనుల శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలోని ఆయా గనులు, ఇసుక రీచుల నుంచి ప్రభుత్వానికి రూ.5 కోట్లకు పైగానే ఆదాయం సమకూరుతోంది.

సొమ్ము చేసుకుంటున్నారిలా.

లాటరైట్, డోలమైట్ నిక్షేపాలుండటంతో అక్రమార్కుల కన్ను పడింది. ఎక్కడ గుట్టలు కనిపిస్తే వాటిని భారీ యంత్రాల ద్వారా తవ్వుతున్నారు. అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు పట్టా భూముల్లో నిక్షేపాలున్నాయని గనుల శాఖ నుంచి అనుమతులు తీసుకోకుండానే తవ్వకాలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వీటిపై దృష్టి సారిస్తే అక్రమాలకు చెక్ పెట్టవచ్చు.

నిబంధనల ప్రకారం అనుమతులు ఇస్తాం- రవిందర్, ఏడీ, గనుల శాఖప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులిస్తాం. లాటరైట్, డోలమైట్ లాంటి ఖనిజ నిక్షేపాలున్నాయి. కొన్ని చోట్ల అనుమతులు ఉన్నాయి. గతంలో ఇక్కడ సర్వే చేస్తే వాటి నాణ్యత స్థాయి తక్కువగా ఉందని తేలింది. దీంతో లీజుకు ముందుకు రాకపోవడం లేదని భావిస్తున్నా. ఔత్సాహికులు దరఖాస్తు చేసుకుని, ధ్రువపత్రాలు సమర్పిస్తే అనుమతులు లభిస్తాయి.

# నాసిరకం రాళ్లతో విభాగిని నిర్మాణం!

జనగామ : జనగామ పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్లో గుత్తేదారులు నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా నాసిరకం సామగ్రితో పనులు చేస్తున్నా పురపాలిక ప్రజారోగ్య విభాగం అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. హైదరాబాద్ రహదారిలో విభాగిని పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు స్పందించి గుత్తేదారును పురమాయించారు. కానీ ఈ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కరవయ్యాయి.

రూ.30 కోట్లతో పనులు

తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీయూఎఫ్ఐడీసీ) నుంచి మంజూరైన రూ.30 కోట్లతో పట్టణంలో విభాగినులు, రహదారి విస్తరణ, కేంద్రీకృత విద్యుత్తు దీపాల వ్యవస్థ, వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించే పనులు చేపట్టారు. ఇందులో భాగంగా హనుమకొండ రోడ్డులో ఎల్లమ్మ గుడి నుంచి బస్టాండు ప్రవేశ ద్వారం వరకు పనులు జరిగాయి. ఈ పనులు చేపట్టిన సంస్థ ఆధ్వర్యంలోనే అంబేడ్కర్ చౌరస్తా నుంచి హౌసింగ్ బోర్డు వరకు పనులు జరుగుతున్నాయి.

పట్టించుకోని అధికారులు

విభాగిని సుందరంగా కనిపించేందుకు జాజు రంగులో ఉన్న గ్రానైట్ రాళ్లను వినియోగించారు. రాంపూర్ రహదారిలో విభాగిని నిర్మాణంలో, స్థానిక బస్టాండు నుంచి నెహ్రూపార్కు వరకు 90 శాతం ఇలాంటివే వాడారు. హనుమకొండ రహదారిలో కొంతమేర పునాదిరాయి లాంటి తెల్లరాళ్లను వినియోగించగా పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. రాయి పొడవు, వెడల్పు, ఎత్తులోనూ నిబంధనల ఉల్లంఘన జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో కథనాలు వచ్చాయి. అధికారులు మొక్కుబడిగా పరిశీలించి వెళ్లారు. ఆ తర్వాత సూర్యాపేట, సిద్దిపేట రహదారిలో ఎక్కువగా రంగు రాళ్లనే వినియోగించారు. ఇప్పుడు మళ్లీ ప్రారంభమైన పనుల కోసం తెప్పించిన రాళ్లను కళ్లెం రహదారి వద్ద ఖాళీ స్థలంలో పోసి, అవసరమైన పరిమాణానికి మలుస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సమీపం నుంచి హౌసింగ్ బోర్డు వరకు తెల్లరంగు రాళ్లనే వినియోగిస్తున్నారు. ఏ రాళ్లయితేనేం అని అధికారులు అంటున్నారు. 'అలాంటప్పుడు సాంకేతిక అనుమతి పొందే సమయంలో, ప్రణాళిక తయారీలో స్పష్టంగా పరిమాణం, కొలతలు, రంగు రాళ్లనే వాడాలనే విషయాలను ఎందుకు పొందుపరిచారు, అప్పుడో రకంగా, ఇప్పుడో రకంగా ఎందుకు? తెల్లవి దుమ్ము, ధూళితో నల్లబడి వికారంగా కనిపించవా?' అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 2018లో ప్రారంభమైన ఈ పథకం పనులు పొడిగింపులతో కొనసాగుతూనే ఉన్నాయి.

క్యూరింగ్ అంతంతే...

చౌరస్తా నుంచి హైదరాబాద్ రోడ్డులో మూడు మాసాల క్రితం నిర్మించిన విభాగిని గోడలకు ఇరువైపులా గట్టు నిర్మించారు. కనీసం 14 రోజులు క్యూరింగ్ చేయాల్సి ఉండగా వారం రోజులే కొంత మేర చేశారని స్థానికులు అంటున్నారు. ముందుకు వెళ్లే కొద్దీ ..రెండు మూడు రోజులే క్యూరింగ్ చేసినట్లు స్పష్టమవుతోంది. పట్టణం మొదట్లో ఒకలా, పట్టణం దాటే కొద్దీ నాసిరకం సామగ్రితో నిర్మాణ పులు చేపట్టడంపై అధికారులు ఏం చెబుతారో చూడాల్సి ఉంది. హౌసింగ్‌బోర్డు కాలనీ వరకు ప్రస్తుతం పనిచేస్తున్న గుత్తేదారు ఆధ్వర్యంలోనే జరుగుతుంది. ఇంకా కనీసం 250 మీటర్ల వరకు పని జరగాల్సి ఉంది. ఇదే ఇలా ఉంటే.. ఆ తర్వాత పట్టణం వెలుపల జరిగే పనులు ఎలా ఉంటాయోనని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కొలతల్లో తేడా లేకుండా చూస్తాం - డీఈ చంద్రమౌళి

నిర్మాణంలో గ్రానైట్ రాళ్లను వాడాలనే నిబంధన ఉంది. రంగురాళ్లే వాడాలని ప్రణాళికలో లేదు. రాళ్ల పరిమాణం, కొలతల్లో తేడా రాకుండా చూస్తాం. అప్పుడు రంగురాళ్లు దొరికినందున అవే తెచ్చామని, ఇప్పుడు ఇవే దొరుకుతున్నాయని గుత్తేదారు అంటున్నారు. క్యూరింగ్‌లో తేడా లేకుండా చూస్తాం.

# దివ్యాంగుల్లో అక్షర వెలుగులు

పెద్దపల్లి : ప్రభుత్వ పాఠశాలలు, భవిత కేంద్రాల్లో చదువుతున్న దివ్యాంగులైన విద్యార్థులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. ఇప్పటివరకు అనారోగ్యం, ఇతర కారణాలతో వార్షిక పరీక్ష రాయకుంటే తిరిగి అదే తరగతిలో కొనసాగాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు పరీక్షల్లో మినహాయింపు కల్పించారు. సాధారణ పిల్లల మాదిరిగా అన్ని పరీక్షలు రాయకున్నా పై తరగతికి ఉత్తీర్ణత చేసేలా వెసులుబాటు కల్పించింది. దీంతో ఉన్నత చదువులపై దివ్యాంగ విద్యార్థుల కలలు సాకారం కానున్నాయి. ప్రస్తుత(2022-23) విద్యా సంవత్సరం నుంచే దీన్ని అమలు చేయాలని ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సుమారు 21 విభాగాల్లోని దివ్యాంగుల జీవితాల్లో అక్షర వెలుగులు నిండనున్నాయి.

జిల్లాలో 800 మందికి ప్రయోజనం

ఒక్కో భవిత కేంద్రంలో ఐఈఆర్పీ(విలీన విద్యా బోధకులు) ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తిస్తున్నారు. ఒక్కో కేంద్రంలో ఇద్దరు నుంచి ముగ్గురు ఐఈఆర్పీలుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం 6-18 ఏళ్ల వయసున్న ప్రత్యేక అవసరాల పిల్లల వైకల్యం? వారి ఇబ్బందులు? తదితర సమాచారాన్ని సేకరిస్తున్నారు. వీరిని సమీపంలోని భవిత, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. పిల్లల ఆరోగ్య స్థితిగతుల ఆధారంగా వారిలో మానసిక వికాసం నింపుతున్నారు. జిల్లాలోని 11 భవిత కేంద్రాలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 800 మంది విద్యార్థులు చదువుతున్నారు.

కనీస ఉత్తీర్ణత అర్హత మార్కుల కుదింపు

తాజా ఉత్తర్వుల ప్రకారం ప్రత్యేక అవసరాల పిల్లలు పరీక్ష రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. అలాగే పరీక్ష సమయం ముగిసిన తర్వాత అదనంగా 20 నిమిషాలు వెసులుబాటు ఇస్తారు. ఒక్కో విభాగంలో వైకల్యాన్ని బట్టి ఉత్తీర్ణత మార్కులు కుదించారు. 35 మార్కులకు 25 వచ్చినా పాస్ చేస్తారు. భాషా ఉచ్ఛారణ సంబంధిత వైకల్యం ఉన్నవారికి జవాబు పత్రాలను ఆయా విభాగాల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో మూల్యాంకనం చేస్తారు. వినికిడి సమస్య తీవ్రంగా ఉన్న వారికి చేతి సైగలతో అన్వయించే వారు సహకరిస్తారు. పరీక్ష సమయంలో వీరు వినికిడి ఉపకరణాలు ఉపయోగించుకోవచ్చు. లోకోమోటార్ వైకల్యం కలిగిన వారితో గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పరీక్ష రాయించాలి. జంబ్లింగ్ పద్ధతిలోనూ దివ్యాంగులకు మినహాయింపు ఉంటుంది.

ఉన్నత విద్యాభ్యాసానికి బాటలు

విజయ్‌కుమార్, సమగ్ర శిక్ష జిల్లా సమన్వయకర్త

ప్రత్యేక అవసరాల పిల్లల భవిష్యత్తును బంగారుమయం చేసేందుకు ప్రభుత్వం ఇటీవల కొత్తగా ఆదేశాలు వచ్చాయి. వివిధ కేటగిరీల్లో వైకల్యం ఉన్నవారికి పరీక్షల్లో మినహాయింపు ఇచ్చారు. వీటిని జిల్లాలోని అన్ని భవిత కేంద్రాలు, పాఠశాలల్లో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఉత్తీర్ణత మార్కులు కూడా తగ్గించడంతో చాలా మంది ఉన్నత విద్యాభ్యాసానికి బాటలు పడతాయి.

# నల్లాల్లోకి నదీజలం వచ్చే..!

నల్గొండ : కొన్నేళ్ల క్రితం వరకు ఉమ్మడి నల్గొండ ఫ్లోరైడ్‌కు మారుపేరుగా ఉండేది. 48 మండలాల్లో ఫ్లోరైడ్ నీటి సమస్య తీవ్రంగా ఉండేది. అతి పెద్ద ఫ్లోరైడ్ పీడిత ప్రాంతంగా ప్రపంచ పటంలో చోటుండేది. 1945లో తొలిసారిగా ఈ సమస్యను నిజాం పాలనలో నార్కట్‌పల్లి ప్రాంతంలో గుర్తించారు. సాధారణంగా లీటరు నీళ్లలో ఉండాల్సిన 0.05 మిల్లీ గ్రాముల ఫ్లోరైడ్‌కు మించి ఉందని కనిపెట్టారు. దీన్ని అరికట్టేందుకు ఎన్నో పరిశోధనలు జరిగాయి. ఆకాశం నుంచి కురిసే వర్షపు నీటిలో ఫ్లోరైడ్ ఉండదని, నదుల్లో ప్రవహించే వర్షపు నీటిని ప్రజలు తాగితే ఫ్లోరోసిస్ సమస్య పరిష్కారం అవుతుందని శాస్త్రవేత్తలు తేల్చారు. చిట్టచివరకు ఉమ్మడి నల్గొండ జిల్లా ఫ్లోరోసిస్ బాధితుల కన్నీళ్లను తుడిచేందుకు తెలంగాణ రాష్ట్రంలో 'మిషన్ భగీరథ' రూపుదిద్దుకుంది. చౌటుప్పల్‌లోనే 2015లో ఈ పథకానికి ముఖ్యమంత్రి కేసీఆర్ చేతులమీదుగా బీజం పడింది. ఆ పథకం అమలుతో ఇంటింటికీ ఫ్లోరైడ్ లేని కృష్ణా, గోదావరి జలాలను అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం శుద్ధి చేసి నల్లాల ద్వారా నిత్యం సరఫరా చేసే ప్రయత్నం సాకారమైంది. 2018 నాటికి ఇంటింటికీ నల్లాల్లో నీటి సరఫరా ఆరంభమైంది. దాదాపు ఇంటికో ఫ్లోరైడ్ బాధితుడు ఉండే ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే కాదు రాష్ట్రంలో కొత్తగా ఒక్క ఫ్లోరోసిస్ కేసు కూడా నమోదు కాలేదని సాక్షాత్తూ పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే కొన్ని సాంకేతిక కారణాలతో అప్పుడప్పుడు నీటి సరఫరాకు అంతరాయం కల్గుతోంది.

ప్రాజెక్టు ప్రత్యేకతలు భారీ పైపులైను: రిజర్వాయర్ నుంచి నీటి శుద్ధి కేంద్రాలకు 229.85 కిలోమీటర్లు ప్రాథమిక ట్రంక్ లైను, 6116.46 కిలోమీటర్లు సెకండరీ ట్రంక్ లైను వేశారు.నీటి శుద్ధి ప్లాంట్లు: నదుల నుంచి సేకరించిన ముడి నీళ్లను కోదండాపురం, బట్లపల్లి, అవంతీపురం, ఉంద్రుగొండ వద్ద ప్లాంట్లు ఏర్పాటు చేసి భారతీయ ప్రమాణాల ప్రకారం శుద్ధి చేస్తున్నారు. నీటి నిల్వ ట్యాంకులు: ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో శుద్ధి చేసిన నీళ్లను గ్రామాల్లో నిల్వ చేయడానికి గతంలో నిర్మించి ఉన్న 2379 ఓవర్ హెడ్ ట్యాంకులను ఉపయోగించుకుంటున్నారు. అదనంగా 2736 ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మాణం చేయించారు.ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 59 మండలాలు, పాత ఏడు పురపాలికల పరిధిలోని 3327 ఆవాసాలకు కృష్ణా, గోదావరి నదీ జలాలు మిషన్ భగీరథ పథకం ద్వారా అందిస్తున్నారు. 2048 నాటికి జిల్లాలో పెరుగనున్న జనాభాను లెక్క వేసి, అప్పటికి రోజుకు 74,70,80,000 లీటర్ల నీళ్లు అవసరమని గుర్తించి దానికి అనుగుణంగా మిషన్ భగీరథ నీటి పథకం రూపొందించారు.

నల్లాల్లో నీళ్లొస్తున్నాయి- తిరుపతమ్మ, ఫ్లోరోసిస్ బాధితురాలు, వట్టిపల్లి ఫ్లోరైడ్ ఎక్కువ ఉన్న నీళ్లు తాగడం వల్ల ఫ్లోరోసిస్‌తో కాళ్లు వంకర్లు పోయి నడవలేని స్థితికి చేరుకున్నా. ఔషధాలు వాడినా ఈ వ్యాధి నయం కాదని వైద్యులు చెప్పారు. నాలా వేల మంది ఫ్లోరోసిస్‌తో బాధ పడుతున్నారు. ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించాలని జరిపిన కార్యక్రమాల్లో నేను కూడా పాల్గొన్నా. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సమస్య పరిష్కరిస్తానని మాటిచ్చాడు. ఆ మాట ప్రకారం ప్రతి ఇంట్లోని నల్లాల్లో కృష్ణా నీళ్లు వచ్చేలా చేశాడు. ఈ నీళ్లను తాగుతున్నాం. ఈ నీళ్లతో ముందు తరాల వాళ్లకు ఫ్లోరైడ్ బాధ తప్పుతుంది.

ఆరోగ్యానికి ఈ నీళ్లే మంచివి- ఏ.ధనుంజయరెడ్డి, ఈఈ, మిషన్ భగీరథ గ్రిడ్, చౌటుప్పల్

మిషన్ భగీరథ పథకం ద్వారా నూరు శాతం ఆవాసాలకు నీటి సరఫరా ఉచితంగా చేస్తున్నాం. 80 శాతం కుటుంబాల వారు ఈ నీళ్లనే తాగుతున్నారు. వీటితోనే వంట చేసుకుంటున్నారు. వారి ఆరోగ్యంలో ఎంతో మార్పు వచ్చిందని వాళ్లే చెబుతున్నారు. భారతీయ ప్రమాణాల ప్రకారం నీళ్లలో 150 నుంచి 300 మధ్య టీడీఎస్ ఉండాలి. భగీరథ నీళ్లలో 180 నుంచి 200 ఉంది. భగీరథ నీటి నాణ్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

# కూరగాయలపురం

నల్గొండ : అదో చిన్న గ్రామం.. 130 కుటుంబాలుంటాయి.. ఆ గ్రామంలోని మహిళలంతా ఆకుకూరలు, కూరగాయల సాగునే నమ్ముకున్నారు. ఇరవై ఏళ్లుగా ప్రతి మహిళా వ్యవసాయ పనుల్లో మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఏటా ఆ గ్రామం నుంచి కూరగాయల విక్రయం ద్వారానే దాదాపు రూ.2 కోట్ల ఆదాయాన్ని పొందుతున్నారు. ఆ కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాకుండా.. మిగిలిన మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామ పంచాయతీకి శివారు గ్రామమైన రాయపురంలో మొత్తం 130 కుటుంబాలు ఉంటాయి. అందులో 110 కుటుంబాల మహిళలు ఏడాది పొడవునా ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తారు. అన్ని కాలాలలో ఇక్కడ అన్నిరకాల ఆకుకూరలు, కూరగాయలు అందుబాటులో ఉంటాయి. ఉన్న భూమిలో ఎకరం మొదలుకొని రెండెకరాల వరకు అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయలు సాగుచేస్తూ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. పురుషులు పత్తి, వరి సాగుచేస్తుండగా మహిళలు మాత్రమే వీటిపై ఆధారపడి ప్రతినిత్యం కష్టపడి పనిచేస్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో సాగుచేసిన ఆకుకూరలు, కూరగాయలకు అన్ని ఖర్చులు పోను నెలకు రూ.20 నుంచి 30వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. గ్రామంలో ఉన్న అందరు మహిళా రైతులు ఈ సాగు ద్వారా ఏటా రూ.2 కోట్లకు పైగానే సంపాదిస్తున్నారు. చిన్న గ్రామమైనందున ఇళ్లకు ఆనుకొనే వ్యవసాయ భూములు ఉండటం ఇక్కడి ప్రత్యేకత. దీనికి తోడు జాతీయ రహదారి పక్కనే భూములు ఉండటంతో రైతులు పండించిన ఆకుకూరలు, కూరగాయలను మార్కెట్‌లకు సులువుగా తరలించే సౌకర్యం ఉంది. కోయగానే కూతవేటు దూరంలో ఉన్న నకిరేకల్ కూరగాయల మార్కెట్‌లోకి రాయపురం రైతులు పండించిన తాజా కూరగాయలు చేరుతుండటంతో వాటికి భలే గిరాకీ ఉంటుంది. రాయపురంలో ప్రస్తుతం టమాట, వంకాయ, బెండ, గోకర, బీర, సొర, కాకర, మునగ, పొట్ల, దొండ తదితర కూరగాయలు, పాలకూర, కలెగూర, తోటకూర, చుక్కకూర, గోంగూర, బచ్చలకూర, మెంతికూర, కొత్తిమీర, పుదీన వంటి ఆకుకూరలు పండిస్తున్నారు.

మంచిధర లభిస్తోంది: జెసింత

మా భూమిలో ఆకుకూరలు, కూరగాయలు సాగుచేస్తూ అందులోనే పనిచేస్తాం. తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపడతాం. నిత్యం ఇద్దరు, ముగ్గురు కూలీలను పెట్టుకొని వాటిని తెంచుతాం. ఉదయం లేవగానే మార్కెట్‌లకు వెళ్లి తొమ్మిది గంటల వరకు వాటిని అమ్ముకొని ఇంటికొస్తాం. నేరుగా అమ్మడంతో మంచి ధర తమకు లభిస్తుంది.

ప్రతిరోజూ ఆదాయం: ఆరోగ్యమ్మకూరగాయలు, ఆకుకూరల సాగుతో ప్రతిరోజూ ఆదాయం వస్తుంది. సంప్రదాయ పంటలు వేస్తే ఏడాదిలో రెండుసార్లు మాత్రమే డబ్బులు వస్తాయి. కానీ వీటి సాగుతో ప్రతిరోజూ ఆదాయం వస్తుంది. ఏరకమైన పంట వేసినా 40 రోజుల్లో కాతకు వస్తుంది. అక్కడి నుంచి మూడు నెలల వరకు నిత్యం ఆదాయం లభిస్తుంది. ఒక్కో పంటకు ప్రత్యామ్నాయంగా మరో పంట ఉండటంతో ఆదాయానికి ఢోకాలేకుండా ఉంటుంది.

# హద్దులు దాటి ఆక్రమణ

భూపాలపల్లి : రెవెన్యూ, నీటిపారుల శాఖల అధికారులు సమన్వయ లోపంతో జిల్లాలోని వివిధ మండలాల్లో చెరువులు, కుంటల శిఖం భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. భూపాలపల్లి జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన నాటి నుంచి భూపాలపల్లి, జంగేడు, పుల్లూరిరామయ్యపల్లి, మహబూబ్‌పల్లి, గణపురం మండలం చెల్పూరు, కాటారం, కాళేశ్వరం తదితర ప్రాంతాల్లో శిఖం భూములు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయి. కొందరు రియల్టర్లు హద్దులు ఏర్పాటు చేసుకొని ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. మరికొందరు కాల్వలు ఆక్రమించుకుని ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.

సర్వేయర్ల కొరత

శిఖం భూముల సర్వే కోసం సర్వేయర్ల కొరత కారణంగా హద్దులు గుర్తించలేకపోతున్నారు. ప్రతి తహసీల్దారు కార్యాలయంలో ఒక మండల సర్వేయర్ ఉంటారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో సింగరేణి యాజమాన్యం బొగ్గు గనుల తవ్వకాల కోసం స్వాధీనం చేసుకునే భూముల సేకరణ పనుల్లోనే ఎక్కువగా నిమగ్నమవుతున్నారు. ప్రతి మండలంలో భూ సర్వేకు దరఖాస్తులు పదుల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. నీటిపారుదల శాఖ అధికారులు తమకు సర్వేయర్‌ను కేటాయించాలని, సంబంధిత రెవెన్యూ ఉన్నతాధికారులకు నివేదిక పంపించినా పని ఒత్తిడి కారణంగా సమయానికి సర్వేయర్‌లు రావడం లేదని నీటిపారుదల ఏఈలు కొందరు చెబుతున్నారు. దీంతో శిఖం భూముల సర్వే పనులకు ఆలస్యమవుతోంది. ఏళ్ల తరబడి సర్వే పనులు చేపట్టకపోవడంతో కబ్జాదారులు శిఖం భూముల్లో దర్జాగా బోర్లు వేసుకొని



అక్రమంగా సాగు చేసుకుంటున్నారు.

ఎఫ్‌టీఎల్ గుర్తింపేది?

జిల్లా కేంద్రంలోని హన్‌మాన్ టెంపుల్ సమీపంలో పాత ఎర్ర చెరువు, కృష్ణా కాలనీలోని కొత్త ఎర్రచెరువు, మంజూరునగర్ ప్రాంతంలో గోరంట్లకుంట, తుమ్మల చెరువుకు కేవలం నాలుగు చెరువులకు మాత్రమే నీటిపారుదల శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవల్) హద్దులు గుర్తించారు. గతంలో తెలంగాణ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల పునరుద్ధరణ పనుల్లో భాగంగా చెరువులు, కుంటల శిఖం భూముల చుట్టూ ట్రెంచి అంటే మీటరు లోతు, మీటరు వెడల్పు కందకం తీయాలని నిబంధన విధించింది. కానీ, ఒకటి రెండు చోట్ల తప్పా.. ఎక్కడా ఇలా చెరువులు, కుంటల శిఖం భూముల చుట్టూ కందకాలు తీయలేదు.

ఈ చర్యలు చేపట్టాలి..

చెరువులు, కుంటల శిఖం భూముల రక్షణకు ప్రత్యేకంగా నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి. పూర్తి బాధ్యత సాగునీటి అధికారులకే ప్రభుత్వం అప్పగించాలి. ఎందుకంటే.. సెంటు శిఖం భూమి అన్యాక్రాంతమైనా సంబంధిత అధికారులే బాధ్యత వహిస్తారు. అన్ని చెరువులు, కుంటల శిఖం భూములను రెవెన్యూ, అటవీ, నీటిపారుదల శాఖ అధికారుల సమన్వయంతో సర్వేయర్ల ద్వారా కొలతలు చేసి, హద్దులు గుర్తించాలి. జిల్లాలో చాలావరకు అటవీ గ్రామాల్లో చెరువు శిఖం భూములు అటవీ శాఖ పరిధిలో ఉన్నాయి. ఈ భూముల సర్వేకు అటవీ అధికారులు రాకపోవడం.. నీటి పారుదల అధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జాకు గురవుతున్నాయి. శిఖం భూములు సర్వే చేయకుండా కొందరు కబ్జాదారులు అడ్డుకుంటున్నారు. వీరికి రాజకీయ పార్టీల నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో సర్వే పనులు నిలిచిపోతున్నాయి. ఈ విధానంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టాలి. శిఖం భూములకు హద్దులు గుర్తించిన వెంటనే 25 నుంచి 30 మీటర్ల మధ్యలో ఒక సిమెంటు పిల్లరు ఏర్పాటు చేయాలి. ఇలా మొత్తం శిఖం భూమి చుట్టూ పిల్లర్లు నిర్మించాలి. శిఖం భూముల్లోనే కాకుండా వరద కాల్వలపై ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దు. ఒక వేళ ఇల్లు నిర్మించుకుంటే సదరు వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

శిఖం భూములను రక్షిస్తాం..

–ప్రసాద్, నీటిపారుదల శాఖ డీఈ

మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణలో భాగంగా రేగొండ మండలంలో ఒక చెరువు శిఖం భూముల సర్వే అనంతరం ట్రెంచ్(కందకం) తీస్తుండగా కబ్జాదారులు కొందరు పురుగు మందు డబ్బాలతో వచ్చి కందకం తవ్వకుండా అడ్డుకున్నారు. అప్పట్లో నియోజకవర్గ పరిధిలో మొత్తం 9 చెరువుల శిఖం భూముల చుట్టూ కందకాలు తవ్వితే అందులో కొన్ని చెరువుల కందకాలను కబ్జాదారులు పూడ్చివేశారు. భూపాలపల్లిలో నాలుగు చెరువులకు ఎఫ్‌టీఎల్ సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశాం. మిగతా అన్ని చెరువుల శిఖం భూములకు జిల్లా కలెక్టర్ అనుమతితో రక్షణ చర్యలు తీసుకుంటాం.

# వర్షాభావంతో సాగు వెనకంజ

జగిత్యాల: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలతోపాటే వానాకాలం పంటలసాగూ వెనకంజలోనే ఉంది. ఇప్పటివరకు కనీసం 30–45 శాతం వరకు పంటలసాగు ఉండాల్సి ఉండగా వ్యవసాయశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లాలో పైర్లసాగు 17.92 శాతం, పెద్దపల్లి 19.63, జగిత్యాల 7.18, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 22.74 శాతం ఉండటం ప్రతికూల పరిస్థితిని కళ్లకు కడుతోంది.

నాలుగు జిల్లాల్లోనూ లోటే..జూన్ 1 నుంచి ఇప్పటివరకు కరీంనగర్ జిల్లాలో 206.3 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 36.2 శాతం తక్కువగా 131.6 మి.మీ వర్షం కురిసింది. పెద్దపల్లి జిల్లాలో 264.5 మి.మీ.కుగాను 30.7 శాతం లోటుగా 183.4 మి.మీ, జగిత్యాల జిల్లాలో 254.2 మి.మీ వర్షపాతానికిగాను 42.4 శాతం తక్కువగా 146.3 మి.మీ, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 207.3 మీ.మీ.కుగాను 37.2 శాతం తక్కువగా 129.9 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. రాష్ట్రంలో లోటు వర్షపాతం గల జిల్లాల్లో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను రూపొందించాలని సీఎం కేసీఆర్ ఆదేశించగా ఉమ్మడి జిల్లాల్లోనూ రాయితీ విత్తన సరఫరా, ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహకాలను ఇవ్వాల్సి ఉంటుంది. భూగర్భ జలాలే ఆధారం జూన్ నెలాఖరు వరకు జగిత్యాల జిల్లాలో సగటు భూగర్భ జలమట్టం 5.97 మీటర్లు, కరీంనగర్‌లో 8.11, పెద్దపల్లి 6.74, సిరిసిల్లలో 9.64 మీటర్లుండగా భూగర్భ జలాల ఆధారితంగానే పంపుసెట్ల ద్వారా రైతులు వానాకాలం పంటలను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోస్తున్న నీటిని మధ్యమానేరు, దిగువమానేరు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులతో పాటుగా పలు చెరువుల్లోకి తరలిస్తున్నారు. మున్ముందు ఆశించిన వర్షం కురవని పక్షంలో, ఎత్తిపోతల ద్వారా ప్రాజెక్టుల్లోకి తగినంతగా నీరు చేరితేనే ఆయకట్టుకు సాగునీటి విడుదలపై ప్రణాళిక రూపొందించే అవకాశం ఉంటుంది. లేకుంటే తక్కువనీటి ఆవశ్యకత ఉండే వానాకాలం పంటలకు ప్రాజెక్టుల్లోని నీరివ్వాలా లేదా కొన్ని మాసాల పాటు ప్రాజెక్టుల్లోకి తగినంత నీటిని ఎత్తిపోసి యాసంగికి పూర్తిస్థాయిలో ఇవ్వాలా అనేదానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

# ఆ విలయానికి.. ఏడాది!





వరంగల్ :గతేడాది జులై 14.. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుకోని ఆపద ఎదురైంది. భారీ వర్షాలతో గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగడంతో కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీ (మేడిగడ్డ), పార్వతి (సుందిళ్ల) పంప్‌హౌస్‌లు ముంపునకు గురయ్యాయి. లక్ష్మీ పంప్‌హౌస్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఊహించని పరిణామం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ఏం జరిగిందంటే..!

గతేడాది జులైలో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో 2022 జులై 14న కాళేశ్వరం వద్ద వరద ఊహించని విధంగా పెరిగింది. ఏకంగా అప్రోచ్ కెనాల్ నుంచి ఫోర్‌బేలో నిండిపోయింది. రక్షణ గోడ కూలిపోవడంతో వరదంతా పంప్‌హౌస్‌లోకి వెళ్లింది. దీంతో 40 మెగావాట్ల సామర్థ్యం గల 17 మోటార్లు నీటిలో మునిగిపోయాయి. 13 నుంచి 17వ మోటారు వరకు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ పంప్‌హౌస్‌లోనే మూడో అంతస్తులోని కంట్రోల్ రూం, మూడు లిఫ్టులు కూడా ముంపునకు గురయ్యాయి. వరద ఉద్ధృతిని గమనించి కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్లు దాదాపు 50 మందితో పాటు, 200 మంది సిబ్బంది, కూలీలు వెంటనే బయటకు వచ్చారు. దీంతో పెనుముప్పు తప్పింది. రూ. కోట్ల ఆస్తి నష్టం వాటిల్లింది.

కంట్రోల్ రూంలో తలదాచుకుని..

పంప్‌హౌస్‌తో పాటు గ్రావిటీ కాలువ సైతం నాలుగైదు చోట్ల దెబ్బతింది. గ్రావిటీకి ఎడమవైపు రహదారి పలుచోట్ల ధ్వంసమైంది. అదేరోజు మేడిగడ్డ బ్యారేజీ పరిసర ప్రాంతాల చుట్టూ నీరు చేరింది. 10 మంది ఇంజినీర్లు, సీఆర్‌పీఎఫ్ క్యాంపు జవాన్లు 90 మంది కంట్రోల్ రూంలో తలదాచుకున్నారు. మరుసటి రోజు పడవల సహాయంతో వారిని తీసుకొచ్చారు..

విద్యుత్తు నిలిచిపోవడంతో..

ఆరోజు నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు పంప్‌హౌస్‌లోకి వచ్చే నీటిని ఎత్తిపోసి వరద ఉద్ధృతిని తగ్గించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో విద్యుత్తు టవర్లు కూలిపోవడంతో నీటిని ఎత్తిపోసేందుకు వీలులేకుండా పోయింది. ప్రత్యామ్నాయ విద్యుత్తు ఏర్పాట్లు లేకపోవడంతో ఏమీ చేయలేకపోయారు.

ప్రత్యేక నిపుణులను రప్పించి..

ముంపునకు గురైన పంప్‌హౌస్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ఐదు నెలల పాటు ఇంజినీరింగ్ అధికారులు శ్రమించారు. విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేసి పంప్‌హౌస్‌లోని నీటిని బయటకు తోడారు. ముందుగా రక్షణ గోడను పునరుద్ధరించారు. అనంతరం ప్రత్యేక నిపుణులను రప్పించి 1 నుంచి 12 మోటార్ల వరకు మరమ్మతులు చేయించారు. ఐదు నెలల తర్వాత 2022 డిసెంబర్ 19న 1వ, 2వ మోటార్లను నడిపించి నీటిని ఎత్తిపోశారు. 12 మోటార్లను అందుబాటులోకి తెచ్చారు. పునరుద్ధరణ పనుల్లో దాదాపు వెయ్యి మంది కూలీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు మోటార్లను సైతం..

13 నుంచి 17 వరకున్న ఐదు మోటార్లను అందుబాటులోకి తెచ్చేందుకు మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిసింది. బెంగళూరు, పుణెకు చెందిన నిపుణులతో వాటిని పునరుద్ధరిస్తున్నారు. వచ్చే నెలలో 17 మోటార్లతో పంపులను రన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇంజినీరింగ్ వర్గాలు తెలిపాయి.

ఇప్పటికీ అనుమతి నిరాకరణ..గతంలో పర్యాటకులు పెద్ద ఎత్తున వచ్చి పంప్‌హౌస్‌ను సందర్శించేవారు. ఇప్పుడు ఇంజినీర్లు, ఇతర సిబ్బంది మినహా బయట వ్యక్తులకు అనుమతి నిరాకరిస్తున్నారు. సిబ్బందిని కనీసం చరవాణులు కూడా వెంట తీసుకెళ్లనీయడం లేదు. ప్రారంభమైన మూడేళ్లలో..శరవేగంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి 2019 జూన్ 21న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. పంప్‌హౌస్ మునిగిపోవడానికి ముందు ఆ మూడేళ్లలో దాదాపు 200 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు.

ప్రస్తుతం సురక్షితమేనా?భారీ వరద వస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటారో ఇప్పటికీ స్పష్టత లేదు. వరదలకు శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదు. ప్రత్యామ్నాయ 220 కేవీ విద్యుత్తు లైను నిర్మాణాన్ని చేపడుతున్నా అది పూర్తికాలేదు. సరస్వతీ(అన్నారం) పంప్‌హౌస్ నుంచి లక్ష్మీ పంప్‌హౌస్ వరకు 156 టవర్లను నిర్మించారు. వాటికి తీగలు బిగించలేదు. ఇంజినీరింగ్ అధికారులు మాత్రం అన్ని రక్షణ ఏర్పాట్లు చేసుకుంటున్నామని చెబుతున్నారు.

# విహారం.. కారాదు విషాదం



జయశంకర్ : వర్షాకాలంలో ప్రకృతి పరవశిస్తుంది. నదులు, వాగులు, సెలయేర్లు, జలపాతాలు కనువిందు చేస్తాయి. వాటిని చూసి పర్యాటకులు మురిసిపోతారు. కేరింతలతో మైమరచిపోతారు. ప్రకృతి అందాల మాటునే ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. నిర్లక్ష్యం, అతి విశ్వాసాలతో జలపాతాల వద్ద పర్యాటకులు మృత్యువాతపడుతున్నారు. ఏటా విషాద ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత, కొంగాల (దుసపాటిలొద్ది), వెంకటాపురం మండలంలోని ముత్యం, ముత్తారం తదితర జలపాతాలున్నాయి. వర్షాకాలంలో వాటిని తిలకించేందుకు పర్యాటకులు పోటెత్తుతారు. జాలు వారుతున్న నీటి ధారాలను చూస్తూ ఉండగానే ప్రమాదాలు జరుగుతున్నాయి.

గతంలో జరిగిన ప్రమాదాలు

గతేడాది అక్టోబరు 23న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడకు చెందిన కృష్ణ(27) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బొగత వద్ద స్నానానికి వెళ్లగా రాళ్లపై జారి ప్రవాహంలో పడిపోయాడు. స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినా నీటిలో మునిగి చనిపోయారు. గతేడాది అక్టోబరు 22న వెంకటాపురం మండలం వీరభద్రవరం సమీపంలోని ముత్యం జలపాతంలో పడి హనుమకొండ జిల్లా కాజీపేటకు చెందిన హరి(32) అనే యువకుడు మృతిచెందాడు. 2021 ఆగస్టు 1న స్నేహితుల దినోత్సవం రోజే వాజేడు మండలం కొంగాల సమీపంలోని దుసపాటి లొద్ది జలపాతం వద్ద ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు.

2020 సెప్టెంబర్‌లో బొగతలో పడి ఒకరు మృత్యువాత పడ్డారు.

ఇవీ కారణాలు..ఎత్తైన గుట్టలపై నుంచి నీరు కిందకు పడే ప్రాంతాల్లో కొలనుల్లా నీటి నిల్వలు ఉంటున్నాయి. స్నానాలు చేసే క్రమంలో లోతు అంచనా వేయకుండా మునిగిపోతున్నారు.కొలనుల్లో బండరాళ్లపై కూర్చోవడం, నిలబడటం చేస్తూ జారి పడిపోతున్నారు. జలపాతాల వద్ద నీటి ప్రవాహ ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. జలపాతం జాలువారే గుట్టను ఎక్కే ప్రయత్నంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇలా చేస్తే మేలు..కొలనుల్లో లోతుకు వెళ్లకుండా కంచెలు ఏర్పాటు చేయాలి. అటవీ సిబ్బందిని, ఇతర పర్యవేక్షకులను అందుబాటులో ఉంచాలి. పర్యాటకులకు సలహాలు, సూచనలివ్వాలి.

ప్రమాదాలు జరిగితే కాపాడేందుకు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలి. మద్యం తాగి వచ్చే వారిని అనుమతించకూడదు.సాహస కృత్యాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

అనుమతి బొగతకే..

బొగత జలపాతం వద్దకు వెళ్లేందుకు మాత్రమే పర్యాటకులకు అనుమతి ఉంది. మిగతా అన్నీ అటవీ ప్రాంతాల్లో ఉంటాయి. ఆయా ప్రాంతాలకు వెళ్లడం కూడా ప్రమాదకరమే. అటవీ అధికారులు అడ్డుకుంటున్నా ఇతర మార్గాల్లో వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. రెండేళ్ల కాలంలో దుసపాటిలొద్ది జలపాతం వద్ద నలుగురు, ఎనిమిదేళ్లలో బొగత వద్ద దాదాపు 18 మంది మృత్యువాత పడ్డారు.

అనుమతులిచ్చి భద్రత కల్పిస్తే..బొగత మినహా వాడేడు, వెంకటాపురం మండలాల్లోని ఇతర జలపాతాల వద్దకు వెళ్లడానికి అనుమతి లేదు. అయితే పర్యాటకులు వాటి వద్దకు వెళ్తున్నారు. అటవీశాఖ వారు అనుమతులు ఇచ్చి అక్కడ సిబ్బందిని ఉంచి భద్రత ఏర్పాట్లు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు. వసతులు, తాత్కాలిక సదుపాయాలు కల్పిస్తే పర్యాటకంగా అభివృద్ధికి అడుగులు పడతాయి. సమీప గ్రామాల వారికి ఉపాధి కూడా లభించే అవకాశం ఉంది.

స్వీయ రక్షణ ముఖ్యం

జలపాతాల వద్ద స్వీయ రక్షణ అత్యంత సురక్షితం. అప్రమత్తంగా ఉండాలి. అక్కడి సిబ్బంది చెప్పిన జాగ్రత్తలు పాటించాలి. అతివిశ్వాసం, అశ్రద్ధ పనికిరాదు. లోతు ప్రదేశంలోకి వెళ్లొద్దు. ఈత వచ్చిన వారు కూడా కొలనులో, ప్రవాహం వద్ద జాగ్రత్తగా ఉండాలి. పిల్లలను మరింత జాగ్రత్తగా చూసుకోవాలి.

# నకిలీ విత్తనాలపై నజర్

వరంగల్ : పంటల సీజన్ వచ్చిందంటే చాలు అన్నదాతలను ఎలా ముంచాలో మాయగాళ్లు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉంటారు. ఏటా నకిలీ, అనుమతి లేని విత్తనాలు అమ్మడం పరిపాటిగా మారింది. డిమాండ్ ఉన్న వాటిని బ్లాక్ మార్కెట్‌కు తరలించి ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ఈ మోసాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వ్యవసాయశాఖతో పాటు పోలీసు అధికారులతో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక నిఘా పంటల సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై నిఘావేసి ఉంచుతున్నారు. అధికారులు తరచూ దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నారు. అనుమతి లేని విత్తనాలతో పాటు నకిలీవి గుర్తిస్తున్నారు. ఈ సీజన్‌లో వరంగల్ నగర పరిధిలో లక్షల విలువ చేసే నకిలీ విత్తనాలను పట్టుకున్నారు. కేసులను నమోదు చేస్తున్నారు. అయినా అక్రమ దందా ఆగడం లేదు. ప్రధాన కారణం రైతుల్లో చైతన్యం రాకపోవడం, లూజుగా విక్రయిస్తున్నా, ఎక్కువ ధరలకు అమ్ముతున్నా రైతులు కొనుగోలు చేస్తున్నారు. నిలదీసి అడగటం లేదు. అధికారులకు ఫిర్యాదులు చేయడం లేదు.ఫిర్యాదు చేయండిఅక్రమదారులు గురించి ఎవరికి, ఎక్కడ చెప్పాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. అక్రమ వ్యాపారాలను అడ్డుకునేందుకు రైతులు ముందుకు రావాలి. అండగా టాస్క్‌ఫోర్స్ బృందాలు ఉన్నాయి. తెలిసిన వెంటనే చేయాల్సింది వారికి ఫోన్ చేసి సమాచారం అందించాలి. మిగతా విషయాలు వారు చూసుకుంటారు. నకిలీ విత్తనాలు, అధిక ధరలకు విక్రయించడం వంటివి జరిగినప్పుడు రైతులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేయాలి.

# పకడ్బందీగా పౌర సేవలు

కరీంనగర్ : జిల్లాలోని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పారదర్శకత కోసం పౌరసేవలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. పురపాలక శాఖ సిటీజన్ బడ్డీ, స్వచ్ఛత యాప్ వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. ప్లేస్టోర్ ద్వారా వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. స్థానిక సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. పలు రకాల సేవలను పొందేందుకు దరఖాస్తులు చేసుకోవచ్చు. మొత్తం 17 అంశాలకు సంబంధించి యాప్‌లో విభాగాలు కనిపిస్తాయి. వీటి ద్వారా నేరుగా ఆయా పుర, నగరపాలికలకు ఫిర్యాదు చేరుతోంది.

ప్రత్యేకంగా సిటిజన్ సెంటర్

కరీంనగర్ నగరపాలక సంస్థలో ప్రత్యేకంగా పౌరసేవల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పని వేళల్లో దీన్ని నగరవాసులు ఉపయోగించుకునే వీలుంది. ఇక్కడ ఇచ్చిన ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్ చేస్తారు. ఫిర్యాదులుంటే ఆయా అధికారులతోపాటు దరఖాస్తుదారుడి చరవాణికి సంక్షిప్త సమాచారం ద్వారా సమాచారం ఇస్తారు. గ్రీవెన్స్ నంబర్ ఆధారంగా ఆ దరఖాస్తు పరిష్కారం అయిందో లేదో తెలుసుకునే వీలుంటుంది. యాప్‌లో వచ్చిన సమస్యలనూ అధికారులకు తెలుపుతారు. గత నెల 21న కరీంనగర్ నగరపాలక కార్యాలయంలో ఈ కేంద్రాన్ని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.

త్వరలో స్మార్ట్‌సిటీతో అనుసంధానం

నగరవాసులు నగరపాలక కార్యాలయానికి రాకుండానే ఇంటి నుంచే అన్ని రకాల సేవలు పొందేలా ప్రత్యేక కార్యచరణ చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో నల్లా, ఆస్తిపన్నులు చెల్లించడంతో పాటు ఇతర రకాల సమస్యలు, ఫిర్యాదులు చేసుకోవడానికి ప్రత్యేకంగా యాప్ తయారు చేసే ఆలోచనలో ఉన్నారు. ఇప్పటికే పురపాలక శాఖ ద్వారా రెండు యాప్‌లు ఉండగా మరో యాప్ ఎందుకనే అభిప్రాయం ఉండగా.. దీని నుంచే లింకు తీసుకొని ఆయా శాఖల అధికారులకు, ప్రజలకు మధ్య సత్వర సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఫిర్యాదులతో పాటు భవన అనుమతులు, ఇంటి నంబర్ల కేటాయింపులు, ఆస్తిపన్ను మదింపు, రిజిస్ట్రేషన్ కాకుండా చేసుకునే వారి పేరు మార్పిడి వంటివి పూర్తిగా యాప్ ద్వారానే నమోదు చేస్తే ఆ వివరాలను సంబంధిత అధికారులకు చేరవేసి నిర్ణీత గడువులోగా పని పూర్తయ్యేలా స్మార్ట్‌సిటీ కమాండ్ కంట్రోల్ విభాగం పర్యవేక్షణ చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. ప్రజలకు సులువుగా, కార్యాలయానికి రాకుండానే పనులు చేసుకునేలా స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు ద్వారా అనుసంధానం చేసేందుకు చర్యలు చేపట్టామని నగర మేయర్ వై.సునీల్‌రావు చెప్పారు.

పౌరసేవల కేంద్రం ద్వారా అందించే సేవలు

ఆస్తిపన్ను, మదింపులి ఖాళీగా ఉన్న భవనానికి రాయితీ

ఆస్తిపన్ను పునఃసమీక్ష కోసం దరఖాస్తు లి అప్పీలు

ఖాళీ స్థలంపై పన్ను మదింపులి నల్లా కనెక్షన్

వ్యాపార లైసెన్స్, పునరుద్ధరణలి పేరు మార్పిడి

భవన అనుమతి ధ్రువీకరణ పత్రం

మాస్టర్‌ప్లాన్ ప్రకారం భూమి వినియోగ ధ్రువీకరణ పత్రం

జనన, మరణ ధ్రువీకరణ పత్రం

జనన ధ్రువ పత్రంలో శిశువు పేరు చేర్చుట, పేరు సరిదిద్దుట

జనన ధ్రువీకరణ ఆన్‌లైన్‌లో లేనిచో ఇచ్చే ధ్రువీకరణ పత్రం

మరణ ధ్రువీకరణ పత్రం, పేరు మార్పిడి, లేని పక్షంలో ధ్రువపత్రం

ఇవ్వడం విద్యాసంస్థలకు పారిశుద్ధ్య ధ్రువీకరణ పత్రం

(పైన పేర్కొన్న వాటికి సరైన నకలు పత్రాలు జత చేయాల్సి ఉంటుంది.)

# అతి వేగం.. బతుకులు ఆగం!

కరీంనగర్ : ఈ నెల 3న రాత్రి కరీంనగర్–హైదరాబాద్ రోడ్డుపై రేణికుంట వద్ద ద్విచక్రవాహనాన్ని వేగంగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో ముగ్గురు యువకులు మృతి చెందారు. ఇసుకను నింపుకొనేందుకు వాగులోకి వేగంగా వెళ్తున్న వాహనం ఢీకొనడంతో ఈ ఘోరం జరిగింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌తోపాటు వాహన యజమానిని తిమ్మాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామని.. నిబంధనలకు విరుద్ధంగా వరుసగా మూడుసార్లు ఇసుకను తరలిస్తూ పట్టుబడిన వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు పట్టుబడిన వారిపై సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని కరీంనగర్ గ్రామీణ ఏసీపీ కరుణాకర్ తెలిపారు. అయినా ఇంకా ఈ ప్రాంతంలో ఇసుక రవాణా దొడ్డిదారిన సాగుతూనే ఉంది. కరీంనగర్ జిల్లాలోని ఇరుకుళ్ల, బొమ్మకల్ ప్రాంతాల నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ల వయసు పట్టుమని పద్దెనిమిదేళ్లు కూడా లేవు. 15 ఏళ్ల వాళ్లే ఇష్టానుసారంగా ట్రాక్టర్లను నడుపుతున్న వీడియోలు కొన్ని నెలల కిందట సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీంతో పోలీసులు గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. పెద్దపల్లి జిల్లాలోనూ మానేరు పరీవాహక ప్రాంతాల్లో ఇదే పంథాలో మైనర్లే వాహనాల్ని నడిపిస్తున్నారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్, రాయికల్, ధర్మపురి మండలాల్లో ఈ దందా జరిగే చోట చిన్నారులే వాహన చోదకులుగా మారుతున్నారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోనూ వాగులు వంకల్లో నుంచి వేగంగా నడిపే ట్రాక్టర్లు ప్రమాద ఘంటికల్ని మోగిస్తున్నాయి. పలువురి మృతికి కారణమవు తున్నాయి. అసలే అక్రమదందా.. ఆపై నిర్లక్ష్యపు పంథా.. పలువురి ప్రాణాలను తీస్తోంది. ఇసుక దందాకు అడ్డాగా మారిన ఉమ్మడి జిల్లాలో వాహనాలు అడ్డగోలు వేగంతో వెళ్తూ నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాల కు కారణమవుతున్నాయి. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలో నదీ పరీవాహక ప్రాంతాలతోపాటు వాగులు వంకల్లో నుంచి రేయింబవళ్లు ఇసుకను రవాణా చేస్తున్నారు. కొన్ని చోట్ల ప్రభుత్వమే ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయగా.. మిగతా చోట్ల ఇష్టానుసారంగానే సహజ సంపద చోరీకి గురవుతోంది. దాదాపు అన్నిచోట్లా వాహన చోదకులకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండటం లేదు. ఈ దందా ఎక్కువగా జరిగే ప్రాంతాలకు చేరువగా ఉన్న ఊళ్లలో సుమారుగా 70–80 ట్రాక్టర్లు ఉంటున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పోలీసులు, రవాణా అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేపట్టడం వల్ల ఈ వ్యాపా రంలో ఆరితేరిన వారిదే రాజ్యమవుతోంది. రహదారులపై గాలితో పోటీ పడుతూ దూసుకెళ్తున్న ఈ ట్రాక్టర్ల వల్ల నాలుగు జిల్లాల పరిధిలో ప్రమాదాల పరంపర కొనసాగుతోంది. ఏడాదిలో సగటున 1,400లకు పైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటే ఇందులో 25 శాతం ఇసుక ట్రాక్టర్ల ద్వారానే జరుగుతున్నట్లు పోలీసుశాఖ గణాంకాలు చెబుతున్నాయి. 83,310 ట్రాక్టర్ ట్రాలీలు.. 8,609 లైసెన్సులు: నాలుగు జిల్లాల పరిధిలో ఏకంగా 83,310 ట్రాక్టర్ ట్రాలీ వాహనాలున్నాయి. వ్యవసాయ అవసరాల కన్నా ఇసుక రవాణాకే వీటిని ఎక్కువగా వినియోగించుకుంటున్నారు. అన్ని రకాల వాహనాలు కలిపి 10,30,072 ఉండగా ఇందులో ట్రాక్టర్ల వాటానే 8 శాతానికిపైగా ఉంది. 2014లో ట్రాక్టర్లు 43,957 ఉండగా.. ప్రస్తుతం దాదాపుగా రెట్టింపు అనే విధంగా వీటి సంఖ్య పెరిగింది. ఈ వాహనాలను నడపాలంటే కచ్చితంగా టీటీ (ట్రాక్టర్ ట్రాలీ) లైసెన్సను పొంది ఉండాలి. నాలుగు జిల్లాల పరిధిలో 8,609 మందికే ఈ లైసెన్స్ ఉండటం గమనార్హం. ప్రత్యేకంగా లైసెన్స్ పొందాలన్న విషయం చాలామంది డ్రైవర్లకు తెలియకపోవడంతోపాటు 18 ఏళ్లు నిండని మైనర్లు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక ట్రాక్టర్లను నడుపుతుండటం ఈ లైసెన్సులు తక్కువ ఉండటానికి కారణం. నిబంధనలపై అవగాహన లేని వీరు అడ్డదిడ్డంగా ట్రాలీ ట్రాక్టర్లు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. చంద్రశేఖర్‌గౌడ్, ఉప కమిషనర్, రవాణాశాఖ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా

# జిజ్ఞాస భూమిక.. విజ్ఞాన వీచిక

కొత్తగూడెం : చిట్టిబుర్రల్లో మెదిలే ఆలోచనలకు పదును పెడితే అద్భుతాలు ఆవిష్కరించవచ్చు. చిన్నారుల్లో సైన్స్‌పై జిజ్ఞాస పెంచేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ప్రతి ఏటా 'ఇన్‌స్పైర్ మనాక్' (వైజ్ఞానిక ప్రదర్శన) నిర్వహిస్తోంది. జాతీయ స్థాయిలో ప్రతిభ చూసిన వారిని బాల శాస్త్రవేత్తలుగా గుర్తిస్తుంది. వారిని విజ్ఞాన రంగంవైపు మళ్లించేలా.. రాష్ట్రపతి నుంచి అవార్డు ప్రదానం చేయిస్తున్నారు. '2023-24' విద్యా సంవత్సరానికి సంబంధించి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనే వారి నుంచి అంతర్జాలంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. వచ్చేనెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపాలి.

విద్యార్థులు ఎక్కువ మంది ఆసక్తి చూపేలా ఉభయ జిల్లాల్లోని గణితం, సైన్సు ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



ఖమ్మం జిల్లాలో ఈ నెల 15న 'పల్లె సృజన', 'నవమి ఫౌండేషన్', ఎస్‌సీఈఆర్టీ సంయుక్త ఆధ్వర్యంలో 758 పాఠశాలలకు చెందిన 600 మంది ఉపాధ్యాయులకు ఏకకాలంలో శిక్షణ ఇచ్చేందుకు డీఈవో, డీఎస్‌వోలు ఏర్పాట్లు పూర్తిచేశారు.

దరఖాస్తు వివరాలు ప్రాజెక్టు వివరాలను పాఠశాల ఐడీ ద్వారా గడువులోగా %inspireawardsdst.gov.in% వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలకు చెందిన 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులు. ఒక పాఠశాల రెండు నుంచి అయిదు వరకు నామినేషన్లు పంపొచ్చు. ప్రాజెక్టు వీడియోలు, చిత్రాలు, పాఠశాల వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జిల్లా ప్రాథమిక ప్రదర్శనకు ప్రాజెక్టు ఎంపికైతే సదరు విద్యార్థి/విద్యార్థుల వ్యక్తిగత ఖాతాలకు రూ.10 వేల చొప్పున జమ అవుతాయి. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభచూపే వారికి ఐఐటీల్లో ప్రవేశాలకు రెండు శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత ఉపాధ్యాయులకు ఉభయ జిల్లాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సైన్స్ అధికారులు చలపతి, బొల్లికొండ సైదులుకు వెల్లడించారు.

# పర్యవేక్షణ లేక.. పనులు నత్తనడక..!

కొత్తగూడెం: కూరగాయలు, మాంసంతో పాటు వివిధ రకాల సరకులు ఒకేచోట అందుబాటులో ఉంటే వినియోగదారులకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం సమీకృత మార్కెట్ భవన సముదాయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు పురపాలికల్లో వీటి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. వీధి వ్యాపారులు రోడ్లపైనే అమ్మకాలు జరుపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

ఎక్కడెక్కడంటే.. మణుగూరులో మున్సిపల్ రోడ్డు రద్దీగా ఉంటుంది. తోపుడు బండ్లతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏడాది క్రితం రూ.4.50 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకు కవలం 50 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. కొత్తగూడెంలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను రూ.7కోట్లతో 2022లో ప్రారంభించారు. బిల్లులు సకాలంలో



రాకపోవడంతో తొలి గుత్తేదారు పనులను అర్ధాంతరంగా ఆపేశారు. తరువాత మరో గుత్తేదారు ముందుకొచ్చినా ఇప్పటివరకు 60 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. వాస్తవానికి గతేడాది డిసెంబర్‌లోనే మార్కెట్ నిర్మాణం పూర్తి కావాల్సి ఉండగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పనుల్లో జాప్యమేర్పడింది. ఇల్లెందులో ప్రభుత్వ స్థలం సరిపడా అందుబాటులో లేకపోవడంతో సమీకృత మార్కెట్ నిర్మాణం ఆలస్యమైంది. ఎట్టకేలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుటి స్థలంలో రూ.4.50 కోట్లతో రెండు నెలల క్రితం పనులు మొదలయ్యాయి. ప్రస్తుతం పిల్లర్ల దశకు చేరుకున్నాయి.

పాల్వంచలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ.4.50కోట్లతో ఎనిమిది నెలల క్రితం ప్రారంభించిన పనులు ఇప్పటివరకు 60 శాతం మాత్రమే పూర్తయ్యాయి.

ఇల్లెందులో స్థల సమస్య వల్ల సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. డిసెంబర్‌లోగా పనులు పూర్తిచేసి వినియోగదారులు, వ్యాపారులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

దమ్మలపాటి వెంకటేశ్వరరావు, పుర ఛైర్మన్, ఇల్లెందు

# అమ్మకానికి పాస్‌పోర్టు స్లాట్లు




ఖమ్మం : ప్రభుత్వాలు ప్రజల అవసరాల కోసం ఎన్ని ఏర్పాట్లు చేసినా ఆ అవకాశాన్ని సొమ్ము చేసుకునేందుకు దళారీ వ్యవస్థ సిద్ధంగా ఉంటోంది. ఇందుకు పాస్‌పోర్టు విభాగం అతీతం కాదని ఇక్కడ జరుగుతున్న తీరు స్పష్టం చేస్తోంది. విదేశాలకు వెళ్లాలనుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. పాస్‌పోర్టు కోసం ఆన్‌లైన్‌లో స్లాటు నమోదు చేసుకుంటే కనీసం నెల రోజులు ఆగాల్సి వస్తోంది. రద్దీని గమనించి గడువు, జాప్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కొన్ని అదనపు స్లాట్లు విడుదల చేస్తోంది. పాస్‌పోర్టు కార్యాలయాలకు సెలవు. నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు శనివారాలు కార్యాలయం తెరిచే వెసులుబాటు కల్పించింది. ఇప్పుడు ఈ అవకాశమే దళారులకు డబ్బులు దండుకునే ఉపాయంగా మారింది.

క్షణాల్లో మాయం

అదనపు స్లాట్లు నెలలో ఎప్పుడు విడుదల చేసే విషయం పెద్దగా ఎవరికీ తెలీదు. స్లాట్లు విడుదల చేయగానే ఎక్కువగా దళారులే వీటిని కమ్మేస్తున్నారనే వాదన ఉంది. నమోదు ప్రక్రియలో శనివారం స్లాట్లు క్షణాల్లో మాయమవుతున్నాయి. వీటిని దళారులు బ్లాక్ చేసి త్వరగా కావాలనుకునే వారికి కేటాయించి వారి నుంచి డబ్బులు దండుకున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

దండుకుంటున్న దళారులు

ఓసారి ఆల్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకున్న తర్వాత రెండుసార్లు తేదీలు మార్చుకునే అవకాశముంటుంది. అదనపు స్లాట్ల విడుదల ఎలా ప్రచారంలో ఉండదో అవసరం, అవకాశం ఉంటే తేదీలను మార్చుకోవచ్చనే విషయం కూడా చాలామందికి తెలియదు. నెల రోజులా తాము ఆగలేం, అత్యవసరమని వచ్చేవారిని దళారులు పసిగట్టి శనివారం స్లాట్లు అంటగట్టి తామేందో పైరవీ చేయించి ముందుకు తెచ్చామని మాయమాటలు చెప్పి స్థాయి, అక్కడి పరిస్థితిని బట్టి రూ.వేలల్లో వసూలు చేస్తున్నట్టు సమాచారం. రోజువారీగా ఖమ్మం పాస్‌పోర్టు కార్యాలయంలో 80 నమోదులు ఉంటున్నాయి. డిమాండ్ ఉన్నప్పుడు విడుదల చేసే స్లాట్లు కూడా 80 వరకు ఉంటున్నాయి. త్వరపడే వారి స్లాట్లను ఈ మార్గంలో ముందుకు తెస్తున్నట్లు తెలుస్తోంది.

ఇదిగో ఇలా..

ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకున్న ఓ వ్యక్తికి, అతడి తర్వాత నమోదు చేసుకున్న మరొకరికి ఒకే వారంలో స్లాట్ తేదీలు వచ్చాయి. ఇందుకోసం సొమ్ములు చెల్లించానని రెండో వ్యక్తి చెప్పారు. అవకాశముంటే తానూ ఇచ్చేవాడినని మొదటి వ్యక్తి అనడంతో ఇక్కడి పర్యవేక్షణాధికారి, సిబ్బంది ఉలిక్కిపడ్డారు. అలాంటి అవకాశమే లేదు. ఎవరు చెప్పారు.. ఎలా చేస్తున్నారంటూ వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు చేరవేశారు. ఈ నేపథ్యంలో దళారుల పనిపట్టడం కోసం విజిలెన్స్ బృందాలు ఏ క్షణమైనా దాడులు చేయొచ్చనే చర్చ కార్యాలయంలో జరుగుతోంది. ఈ అంశంపై పర్యవేక్షణాధికారితో మాట్లాడుతూ తమ చేతిలో ఏమీ లేదని, ఏదైనా నిర్ణయం కేంద్ర కార్యాలయంలోనే జరుగుతుందన్నారు.

# గిరిపుత్రుల విద్యాధామం ఏకలవ్య



ఖమ్మం : కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే భవనాలు.. ఇంజినీరింగ్ కళాశాలల్లో కనిపించే అత్యాధునిక సదుపాయాలు.. చుట్టూ పచ్చని కొండల మధ్య ఆహ్లాదకరమైన విశాల ప్రాంగణంలో కళ్లు మిరుమిట్లు గొలిపే భవన సముదాయాలు ఏకలవ్య విద్యాలయాల సొంతం. ఆ ప్రాంగణంలో అడుగు పెట్టిన ఏ తల్లిదండ్రులకైనా తమ బిడ్డలను ఇక్కడే చదివించాలనే కోరిక కలగకుండా ఉండదంటే అతిశయోక్తి కాదు. ఉభయ జిల్లాల్లో..గిరిపుత్రులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేసింది. రాష్ట్రం మొత్తమ్మీద 12 ఏకలవ్య పాఠశాలలు మంజూరైతే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పరిధిలో టేకులపల్లి, రేలకాయలపల్లి(కారేపల్లి), ములకలపల్లి, దుమ్ముగూడెం, చర్ల, గుండాలలో ఆరుండటం గమనార్హం. ఈ నెలాఖరు నాటికి టేకులపల్లి ఏకలవ్య పాఠశాలను ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. మిగిలిన ఐదు ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి.

టేకులపల్లి విద్యాలయం స్వరూపం..

బద్దుతండా పరిధిలో 9.5 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఏకలవ్య పాఠశాల భవన సముదాయాలు నిర్మించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. ఫేజ్-1 పనులు పూర్తి కాగా, ఫేజ్-2 పనులు తుది దశకు చేరుకున్నాయని సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) అధికారులు చెబుతున్నారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఒక్కో తరగతిలో 60 మంది విద్యార్థులు అభ్యసిస్తారు.

ఇంటర్‌లో ఎక్కువ మందికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో అదనంగా 60 సీట్లను ప్రభుత్వం కేటాయించింది. ప్రతి తరగతిలో బాలికలు, బాలురు 30 మంది చొప్పున ఉంటారు. సీబీఎస్ఈ సిలబస్‌లో బోధన సాగుతుంది. ఇంటర్ వరకు ఏకలవ్యలో చదువుకునే అవకాశం ఉంటుంది. గిరిజన విద్యార్థులతో పాటు ప్రతి తరగతిలో ఆరుగురు చొప్పున దివ్యాంగులు, ఇతర కులాల విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. బాలురు, బాలికలకు రెండు చొప్పున వసతిగృహాలతో పాటు విశాలమైన కిచెన్, డైనింగ్‌హాల్, లైబ్రరీ, మరుగుదొడ్లు నిర్మించారు. 17 తరగతి గదులు, నాలుగు ప్రయోగశాలలు, ఒక కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, స్టాఫ్, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌కు గదులు కేటాయించారు. స్టాఫ్ కోసం ప్రత్యేకంగా క్వార్టర్లు నిర్మించారు. సువిశాల క్రీడాప్రాంగణం కలదు. ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులు నిర్మించారు. ప్రధాని మోదీ డ్రీమ్ ప్రాజెక్ట్ కావడంతో వారానికోసారి నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (నెస్ట్) పర్యవేక్షణ ఉంటుంది. గిరిపుత్రులకు నాణ్యమైన విద్యనందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఏకలవ్య పాఠశాలలను మంజూరు చేసింది. టేకులపల్లి ఏకలవ్య పాఠశాలను ఈనెలాఖరులో ప్రధాని మోదీ ప్రారంభించే అవకాశముంది. చందర్‌రావు, అసిస్టెంట్ ఇంజినీర్, సీపీడబ్ల్యూడీ

# ఉత్తమ బోధన.. ఉన్నతికి ఆలంబన

కొత్తగూడెం: ఇక్కడి అధ్యాపకులు కార్పొరేట్‌కు దీటుగా బోధన అందిస్తారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూనే పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తూ వారి ఉన్నతికి మార్గం వేస్తున్నారు. మీ పిల్లల భవిష్యత్తుకు మాది బాధ్యత అంటూ పది పాసైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి కళాశాలలో చేర్పిస్తున్నారు. గత నాలుగేళ్లుగా ఇంటర్ ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో ఏటా తొమ్మిది వందలకు పైగా మార్కులు అలవోకగా సాధిస్తున్నారు. దీంతోపాటు ప్రసిద్ధిచెందిన ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు పొందుతున్నారు. ఇదీ ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఘనత.

ఇవిగో నిదర్శనాలు 2019 ఇంటర్ ద్వితీయలో 981 మార్కులు సాధించిన విద్యార్థిని సొంటి సరస్వతి ఎంసెట్లో ర్యాంకు సాధించి ఓయూ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో, కోరట్ల సరస్వతి మంథనిలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో చేరారు. 2020లో అంధ విద్యార్థి బాణోత్ గణేశ్‌నాయక్ 940మార్కులు సాధించి కాలికట్లోని ఎన్ఐటీలో చేరారు. 2021లో విద్యార్థిని కోయ శ్రీలక్ష్మి 968 మార్కులు సాధించి ఎంజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతోంది. 2022లో శ్యాంసుందరాచారి ఎంపీసీలో 985, రంజిత్‌కుమార్ ఎంపీసీలో 975మార్కులు సాధించారు. వీరు ఇరువురు హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఈ ఏడాది ఇంటర్ ఎంపీసీ ద్వితీయలో గంటల ఈశ్వరి 978, ప్రథమలో గోపి 456 మార్కులు సాధించారు. ఈసారి ఎంసెట్లో ప్రవేశాలకు ఎంపీసీ విద్యార్థులు 12మంది, బైపీసీ విద్యార్థులు 11మంది అర్హత సాధించడం విశేషం.

వాట్సప్‌లో తరగతుల సమాచారం

కళాశాలలోని ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, వృత్తివిద్య కోర్సులు చదువుతున్న విద్యార్థులకు గ్రూపుల వారీగా ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు వారికి తరగతులకు సంబంధించిన



సమాచారం అందులో అధ్యాపకులు పోస్ట్ చేస్తారు. పోటీ పరీక్షలకు సంబంధించిన సమాచారం, ఆయా సబ్జెక్టులకు అవసరమైన సామగ్రికి సంబంధించిన వివరాలను అధ్యాపకులు చేరవేస్తున్నారు.

ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రత్యేకతలు

కళాశాలలో నిరంతర పర్యవేక్షణ కోసం దాతల సాయంతో 29 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళ ఎంసెట్, జేఈఈ, నీట్కు శిక్షణ ఇస్తున్నారు. ఎంసెట్ అభ్యసన సామగ్రి సైతం అందించి పరీక్షలు పూర్తయిన తరువాత ఆ సామగ్రిని బుక్ బ్యాంక్‌గా వినియోగించుకుంటున్నారు. తరగతి గదులు విశాలంగా ఉండటంతో పాటు గోడలపై చిత్రాలు గీయించారు. విద్యార్థులకు కంప్యూటర్‌పై ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తూ వారికి ఆన్‌లైన్ పరీక్షా విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. పిల్లలు కళాశాలకు గైర్హాజరైతే తల్లిదండ్రులకు సమాచారం అందిస్తూ వారు కళాశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రారంభం నుంచే దృష్టి

కళాశాల ప్రారంభం నుంచే ప్రణాళిక ప్రకారం విద్యార్థులకు వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అధ్యాపకుల సమష్టి కృషితో ఏటా విద్యార్థులు అత్యధిక మార్కులు సాధిస్తున్నారు. ఎంసెట్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు. ప్రస్తుతం ద్వితీయలో 106 మంది, ప్రథమలో 75మంది విద్యార్థులున్నారు. ఆగస్టు నెలాఖరు వరకు ప్రవేశాలు పొందవచ్చు. వాసిరెడ్డి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్

# మేల్కొనకుంటే కనుమరుగే!

వరంగల్ :కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలో 1023, వరంగల్ మహా నగరపాలక సంస్థ పరిధిలో 223 చెరువులు, కుంటలు ఉన్నట్లు దస్త్రాల్లో ఉంది. కానీ క్షేత్రస్థాయిలో వాటి విస్తీర్ణం, హద్దులకు సంబంధించి ఎలాంటి బోర్డులు ఏర్పాటు చేయలేదు. నీటి వనరుల సంరక్షణ ప్రాముఖ్యతను గుర్తించిన భారత అత్యున్నత న్యాయస్థానం ప్రతి చెరువు, కుంట, జలాశయానికి పూర్తిస్థాయి నీటినిల్వ (ఫుల్ ట్యాంకు లెవల్) హద్దులను గుర్తించాలని గతంలోనే ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం అధికారులు తప్పనిసరిగా ఎఫ్‌టీఎల్ పరిధి గుర్తించి, దిమ్మెలు ఏర్పాటు చేయాలి. ఇలా చేయడం వల్ల కొంతవరకైనా ఆక్రమణలను నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇదే చెరువులు, కుంటలకు రక్ష అంటున్నారు. అధికారులు మేల్కోకుంటే చెరువులు, కుంటలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోనే ఎక్కువ శాతం చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవుతున్నాయి. వీటిని అరికట్టాలంటే అన్ని శాఖలు కదలాలని నిపుణులు చెబుతున్నారు. దీనికోసం జిల్లా పాలనాధికారులు కలుగజేసుకోవాలని సూచిస్తున్నారు. లేదంటే భావితరాలకు నీటి వనరులు లేకుండా పోతాయని, దీని ప్రభావం పర్యావరణంపై తీవ్రంగా ఉంటుందని చెబుతున్నారు.

రెవెన్యూ, భూమి, కొలతలు(ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్సు), సాగునీటి పారుదల శాఖ, గ్రేటర్ వరంగల్, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, పోలీసు శాఖలు ఉమ్మడిగా చెరువులు, కుంటలు పరిశీలించాలి. పాత దస్త్రాలను ఆధారం చేసుకొని, ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి చెరువుల విస్తీర్ణం తేల్చాలి. నలువైపులా హద్దులు పాతాలి. సర్వేనంబర్ల వారీగా ప్రభుత్వ, ప్రైవేటు పట్టా భూముల వివరాలతో కూడిన బోర్డులు క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేయాలి. స్థానికులందరికీ తెలిసేలా ప్రచారం చేయాలి. గ్రామ పంచాయితీ, పురపాలికల వార్డు కార్యాలయాల్లో చెరువులు, కుంటల వారీగా వివరాల నోటీసు బోర్డులు పెట్టాలి. ఎఫ్‌టీఎల్ పరిధిలో భవన నిర్మాణాలు, వెంచర్లు ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి.

ప్రయోజనం లేని పరిరక్షణ కమిటీ..

కుడా పరిధిలో చెరువులు, కుంటలు కాపాడేందుకు 2017 ఏప్రిల్‌లో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సూచన మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ చెరువుల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛైర్‌పర్సన్‌గా, కుడా వైస్ ఛైర్మన్ కన్వీనర్‌గా, వరంగల్, జనగాం జిల్లాల కలెక్టర్లు, మూడు జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, నీటిపారుదల శాఖ, రెవెన్యూ, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్సు, గ్రేటర్, కుడా, పోలీసు శాఖల అధికారులు, ఇద్దరు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఏర్పాటు చేసిన ఆరేళ్లలో కేవలం నాలుగుసార్లు మాత్రమే సమావేశం అయింది. అయితే ఒక్క తీర్మానం కూడా అమలు కాలేదన్న విమర్శలున్నాయి.

అధికారులు కదలాలి..- చీకటి రాజు, కాకతీయ వారసత్వ కమిటీ కన్వీనర్, హనుమకొండ

గత 15 ఏళ్లుగా చెరువులు, కుంటల ఆక్రమణలపై కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులకు వెయ్యికి పైగా ఫిర్యాదులు చేశా. కార్యాలయాల చుట్టూ వందలసార్లు తిరిగి తిరిగి విసుగెత్తి భద్రకాళి చెరువు ఆక్రమణలపై లోకాయుక్తలో ఫిర్యాదు చేశాం. నివేదిక అందజేయడంలో అధికారులు అశ్రద్ధ చేస్తున్నారు. ఆక్రమణలు ఆగాలంటే అన్ని శాఖల అధికారులు కదలాలి. క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి, విస్తీర్ణం, హద్దులు ఖరారు చేయాలి. బోర్డులు పెట్టించాలి.

20 ఏళ్లుగా ఉద్యమం..- పెరుమాళ్ల లక్ష్మణ్, చెరువులు, కుంటల పరిరక్షణ కమిటీ, వరంగల్ కాశీబుగ్గ

చెరువులు, కుంటల ఆక్రమణలపై గత 20 ఏళ్లుగా ఉద్యమిస్తున్నా. 2002లో చెరువులు, కుంటల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేశాం. దేశాయిపేట చిన్నవడ్డేపల్లి, ములుగురోడ్డు కోట చెరువు, ఉర్సు రంగసముద్రం, బెస్తం చెరువు, కట్టమల్లన్న చెరువుల ఆక్రమణలు వెలుగులోకి తెచ్చాం. వందల సార్లు అధికారులకు వినతులు ఇచ్చాం. ఎలాంటి చర్యల్లేవు. ఐదారేళ్లలో ఆక్రమణలకు అడ్డు లేకుండా పోయింది. ఎఫ్‌టీఎల్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

# ఇంటి భోజనమే దిక్కు

కరీంనగర్ : జిల్లాలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేపట్టడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఉపాధ్యాయులే వంటలు వండి విద్యార్థులకు వడ్డిస్తున్నారు. కొన్ని బడుల్లో విద్యార్థులే ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్నారు. మరికొందరు మధ్యాహ్న భోజనానికి ఇళ్లకు వెళున్నారు. ఈ నేపథ్యంలో పిల్లల హాజరు తగ్గే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. త్వరగా కార్మికుల సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. టిఫిన్ బాక్సులు తెచ్చుకొని..మానకొండూర్ : మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేస్తుండటంతో బుధవారం పచ్చునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకొని తిన్నారు. కొంత మంది విద్యార్థులు భోజనం చేయడానికి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గే అవకాశం ఉంది. మొత్తం 142 మంది విద్యార్థులు, 12 మంది ఉపాధ్యాయులున్నారు. నిత్యావసర ధరలు పెరగడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రధానోపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

గన్నేరువరం: మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలో నిమగ్నమై ఉండటంతో మండలం కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని 250 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు. మొదటి రోజు ఉపాధ్యాయులే వండినా.. రోజూ అమలు పరిచే పరిస్థితి కనబడటం లేదు. కాగా విద్యార్థులు ఇంటి నుంచి టిఫిన్ బాక్సు తెచ్చుకున్నారు.

తాత్కాలిక సిబ్బందితో వంట

శంకరపట్నం: పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన నిర్వాహకులు సమ్మె చేస్తుండటంతో వంట చేయడం కష్టంగా మారింది. శంకరపట్నం మండలంలో 41 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా గురువారం 18 పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట కరవైంది. పలు పాఠశాలలలో ప్రైవేటు వ్యక్తులతో వంట చేయించి విద్యార్థులకు అందించారు. మొలంగూర్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు రోజా రమణి పాఠశాలలోని తాత్కాలిక సిబ్బంది సాయిలు, పాఠశాల సబార్డినేట్ లక్ష్మినారాయణతో వంట సిద్ధం చేయించి 40 మంది విద్యార్థులకు భోజనం పెట్టారు. కేశవపట్నంలోని ఎస్సీ, బీసీ కాలనీ పాఠశాలలో విద్యార్థులు ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకున్నారు. వంకాయగూడెం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు ఇంటికి వెళ్లి భోజనం చేసినట్లు సమాచారం. ఉపాధ్యాయులే వండి.. వడ్డించిజమ్మికుంట: జమ్మికుంటలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు భోజనాన్ని వండారు. కూరగాయలు తీసుకొచ్చి కూర చేశారు. సుమారు 60 మంది విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. స్థానిక జడ్పీ బాలికల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యార్థులే ఇళ్ల నుంచి టిఫిన్ బాక్సులు తీసుకొచ్చారు. స్థానిక ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలోనూ ఇంటి భోజనాన్నే తిన్నారు.

# భవిష్యత్తుపై అవగాహనతో లక్ష్య సాధన

కరీంనగర్ : విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ కీలకమైంది. ఇంటర్‌లో తీసుకునే నిర్ణయంపై జీవితం ఆధారపడి ఉంటుంది. భవిష్యత్తుపై అవగాహన లేకుండా ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు తప్పటడుగులు వేయడంతో జీవితంలో ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. భవిష్యత్తు పయనం, ఏ సబ్జెక్టులో ముందుకు సాగాలో తెలియక విద్యార్థులు అయోమయ స్థితిలో ఉంటారు. ఉన్నత చదువులపై ఇంటర్‌లోనే విద్యార్థులకు సరైన అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కేఎల్ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో కరీంనగర్ లోని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో 'దశ–దిశ' అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథులు విద్యార్థులు భవిష్యత్తు చదువులపై అవగాహన కల్పించిన అనంతరం విద్యార్థులకు లక్కీ డిప్ నిర్వహించి ఎంపికైన విద్యార్థులకు బహుమతులు అందించారు. సదస్సులో విద్యార్థులు నేర్చుకున్న విషయాలు, భవిష్యత్తులో తమకు ఏవిధంగా ఉపకరిస్తుందో భారతి, ధనిష్‌లు వేదికపై వివరించారు. కార్యక్రమంలో కరీంనగర్ యూనిట్ ఇన్‌ఛార్జి యుగేందర్‌రెడ్డి, కేఎల్‌యూ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

విద్యార్థులకు భవిష్యత్తు గురించి ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరై విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి. ఇంటర్మీడియట్ తర్వాత తోటి స్నేహితులు తీసుకున్నారని, కోర్సుకు ప్రస్తుత మార్కెట్‌లో డిమాండ్ ఉందని గుడ్డిగా నమ్మి చేరిపోవద్దు. విద్యార్థికి నచ్చిన, నైపుణ్యం సాధిస్తామని నమ్మిన కోర్సును ఎంచుకోవాలి. భవిష్యత్తు విద్యాభ్యాసం కోసం వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ ముందుకుసాగాలి. ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్తు మార్గదర్శనం కోసం దశ–దిశ సదస్సు ఏర్పాటు చేసిన కేఎల్ విశ్వవిద్యాలయం బాధ్యులకు కృతజ్ఞతలు.

డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత

విశ్వవిద్యాలయం ఎంపిక కీలకం

ఇంటర్ తర్వాత విద్యార్థులు విశ్వవిద్యాలయం ఎంపిక విషయంలో కీలకంగా వ్యవహరించాలి. విశ్వవిద్యాలయంలో చేరే ముందు ఎన్ఐఆర్ఎఫ్ ప్రభుత్వ ర్యాంకులు చూసుకుని, క్షుణ్ణంగా తెలుసుకుని చేరాలి. కేఎల్ విశ్వవిద్యాలయంలో 60దేశాలకు చెందిన విద్యార్థులు, విభిన్న సంస్కృతులు, భిన్న ఆచారాలతో విద్యనభ్యసిస్తున్నారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో మూడేళ్లు చదివి నాలుగో సంవత్సరంలో ఉద్యోగం చేస్తూ యూనివర్సిటీకి వస్తుంటారు. నైపుణ్యం కలిగిన డాక్టరేట్ చేసిన అధ్యాపకులతో కేఎల్‌యూలో విద్యాబోధన ఉంటుంది. ఇక్కడ చదివిన విద్యార్థులకు అత్యధికంగా రూ.60 లక్షల ప్యాకేజీతో దేశ, విదేశాల్లో ఉద్యోగాలు చేసే అవకాశం లభిస్తుంది. ఉద్యోగాలు చేయాలనే ఉద్దేశం నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి కేఎల్‌యూ తీర్చిదిద్దుతుంది. కోర్సు ఎంచుకునే విషయంలో జాగ్రత్త వహించి అందులో పూర్తి స్థాయి నైపుణ్యం పొందాలి. నైపుణ్యం ఉన్న విద్యార్థులకే ప్రపంచంలో ఎక్కడైనా గుర్తింపు లభిస్తుంది.

ఎల్.కోటేశ్వర్‌రావు, ప్రిన్సిపల్, కేఎల్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్

పట్టుదలతో అత్యున్నత స్థాయి

విద్యార్థులు భవిష్యత్తుపై అవగాహనతో ముందుకు సాగినప్పుడే అత్యున్నత స్థాయికి చేరుకుంటారు. నలభై ఏళ్లకు పైగా కేఎల్ విశ్వవిద్యాలయం వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసింది. చదవాలి, ఎదగాలనే ఆసక్తి, పట్టుదల, ప్రతిభ ఉన్న విద్యార్థులకు డబ్బు సమస్య కాదని గుర్తించాలి. నైపుణ్యం కలిగిన విద్యార్థులకు మార్కెట్‌లో విస్తృత అవకాశాలున్నాయి. ఇంటర్ తర్వాత నాలుగేళ్ల చదువు 40 ఏళ్ల భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఎంచుకునే విశ్వవిద్యాలయం, కోర్సు విషయంలో జాగ్రత్త వహించాలి. ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో ఏకకాలంలో రెండు కోర్సులు, విశ్వవిద్యాలయంలో చదివే కోర్సును విదేశాల్లో చదివే అవకాశం ఉంది. ఆర్థికంగా వెనకబడిన విద్యార్థుల కోసం అందుబాటులో ఉన్న విద్యాలక్ష్మి పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి. ఈ అవకాశాలన్నీ కేఎల్‌యూలో ఉన్నాయి. కేఎల్‌యూ నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో వచ్చిన ర్యాంకు, ఇంటర్మీడియట్ మార్కులు, జేఈఈ ఫలితాల ఆధారంగా కేఎల్‌యూ ఫీజుల్లో రాయితీ ఉంటుంది. జాతీయ స్థాయిలో కేఎల్‌యూ 27వ స్థానంలో ఉంది. – డాక్టర్ జె.శ్రీనివాస్‌రావు,

# అంతా బినామీల చేతుల్లోనే




నల్గొండ : తనకు మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం అన్నట్లు తయారైంది నల్గొండలో పుర ఆస్తుల దుస్థితి. పురపాలికకు ఆదాయం పెంచాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు సుమారు రూ.500 కోట్ల విలువైన ఆస్తులను కరిగిస్తూ అన్యులకు ధారాదత్తం చేసేందుకు సిద్ధమయ్యారు. లీజులకు తీసుకున్న వ్యాపారులకే ధారాదత్తం చేసేందుకు పావులు కదిపారు. జిల్లాకు చెందిన అధికార పార్టీ ప్రజాప్రతినిధి రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పడంతో వ్యాపారులకు కేవలం మార్కెట్ ధరకు అప్పగించేందుకు ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల కుమ్మక్కు..

మున్సిపాలిటీ పరిధిలో 234 దుకాణాలు ఉండగా 2016లో 232 మడిగెలకు లీజుకు అప్పగించేందుకు అప్పట్లో టెండర్లు నిర్వహించారు. అ సమయంలో కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఇప్పటి వరకు టెండర్లు తెరవకుండానే కాలయాపన చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల కారణంగా ఏళ్లు గడుస్తున్నా కోర్టు స్టే రద్దు చేయించే సాహసం అధికారులు చేయలేదు. కొన్నాళ్లుగా లీజు దుకాణాలపై కన్ను పడిన వ్యాపారుల కుట్రలకు అధికార పార్టీ నేతలు కుమ్మక్కైనట్లు ప్రచారం సాగింది. మున్సిపాలిటీకి సంబంధించిన రూ.500 కోట్లకు పైగా విలువైన స్థిరాస్తి మడిగెలను జీవో 58, 59 ద్వారా క్రమబద్ధీకరించేందుకు పావులు కదిపినట్లు తెలిసింది. ప్రకాశంబజారు, వస్త్రాలత బజారు, కూరగాయలమార్కెట్ ప్రాంతాల్లోని స్థలాలు బహిరంగా మార్కెట్‌లో గజం ధర రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల మధ్య పలుకుతుండగా వ్యాపారులకు మాత్రం గజం రూ.40 వేల నుంచి రూ. రూ.60 వేలలోపు తగ్గించి అప్పగించేలా ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.

బినామీల చేతుల్లోనే..నల్గొండ మున్సిపాలిటీకి పట్టణంలో ప్రధానమైన వాణిజ్య ప్రాంతాల్లో రూ.వందల కోట్ల విలువైన స్థలాలు, దుకాణాల సముదాయాలు ఉన్నాయి. అందులో ప్రధానంగా ప్రకాశంబజారులో 1972లో ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చిన నిధులతో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన 14 దుకాణాల సముదాయాన్ని సైతం వ్యాపారులకు కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారు. ఉన్నతాధికారుల, ప్రజల కళ్లకు గంతలు కట్టి దుకాణాల సముదాయాన్ని సైతం లీజు స్థలాల కిందనే పరగణిస్తున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీకి చెందిన 100కు పైగా లీజు దుకాణాలు బినామీల చేతుల్లో బంది అయ్యాయి.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే– రమణాచారి, కమిషనర్

ప్రభుత్వ ఆదేశాల మేరకే ప్రతిపాదనలు తయారు చేస్తాం. లీజు తీసుకున్న వ్యాపారులకే ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారం క్రమబద్ధీకరించే అవకాశం ఉంది. ప్రభుత్వ సర్క్యులర్ ప్రకారం అర్హులైన వారి వ్యాపారుల వివరాలు ప్రభుత్వానికి పంపిస్తాం. తదుపరి ఆదేశాల ప్రకారం ముందుకు వెళ్తాం.

# ప్రగతి పరుగులు.. భవితపై ఆశలు

వరంగల్ :కాలగమనంలో మరో ఏడాది కరిగిపోతోంది. ఈ ఏడాది జరిగిన మేలు, కీడు చూసుకుంటే.. కొన్ని రంగాలు ప్రగతి వైపు దూసుకుపోతుండగా, కొన్ని వెనకబడి ఉన్నాయి. నేరాలు తగ్గుముఖం పట్టకపోవడం కొంత ఆందోళన కలిగిస్తోంది. సైబర్ నేరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఏడాది విద్య, వైద్యరంగాలు దూసుకుపోగా, వ్యవసాయంలో మిశ్రమ ఫలితాలు కనిపించాయి. 'హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వచ్చి గుండె వైద్యం చేసుకునే స్థాయికి ఎంజీఎం, కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఎదిగాయి'ఈ సంవత్సరం ప్రజలకు బహుళ వైద్య సేవలందాయి. కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి దాదాపు లక్షమందికి ఓపీ సేవలు, 11572 మందికి ఐపీ సేవలందించి ప్రజల మెప్పు పొందింది. ప్రధాన మంత్రి స్వాస్థ్య సురక్ష యోజన కింద రూ.150కోట్లతో నిర్మించిన ఈ ఆసుపత్రిలో పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన మహిళకు ఓపెన్‌హార్ట్ సర్జరీ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తిచేశారు. దాదాపు 18 సంవత్సరాల తర్వాత ఇక్కడ ఈ సర్జరీ జరిగింది. మోకాలు కీలుమార్పిడి శస్త్రచికిత్సలు, క్యాన్సర్, న్యూరోసర్జరీ, పీడియాట్రిక్, సర్జరీలు నిర్వహించడంలో ముందు వరుసలో ఉంది. వరంగల్‌ను ఆరోగ్య కేంద్రం(హెల్త్ హబ్)గా తీర్చిదిద్దేలా సెంట్రల్ జైల్ స్థలంలో 2021 జూన్ 21న సీఎం కేసీఆర్ సుమారు రూ.1100 కోట్ల వ్యయంతో 24 అంతస్తుల సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎల్‌అండ్‌టీ కంపెనీ ఇప్పటి వరకు దాదాపు ఏడు అంతస్తుల వరకు నిర్మాణం పూర్తిచేసింది. కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో కొత్త సంవత్సరంలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలనుకుంటున్నామని ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు.

పెరిగిన సైబర్ నేరాలు.. వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో సైబర్ నేరాలు, మహిళలపై నేరాలు, చోరీలు పెరగ్గా, హత్యలు, దోపిడీలు కొంతమేరకు తగ్గాయి. 2022 వార్షిక నివేదిక విడుదల చేశారు. గతేడాది అన్ని విభాగాల్లో కలిపి 11,047 కేసులు నమోదుకాగా ఈఏడాది 12,966 కేసులు నమోదయ్యాయి. గంజాయి రవాణాను సమర్థంగా అరికట్టగలిగారు. టాస్క్‌ఫోర్స్ విభాగం మత్తు పదార్థాల నియంత్రణతో పాటు నకిలీ నోట్లు, సరిఫికెట్లు, బీమా పత్రాల ముద్రణ, నకిలీ వైద్యులు, క్రికెట్ బెట్టింగ్‌లపై ఉక్కు పాదం మోపింది. 31 గంజాయి కేసుల్లో రూ. 6.40 కోట్ల విలువ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 104 గంజాయి స్మగ్లర్లను పట్టుకున్నారు. కమిషనరేట్‌లో 646 కేసుల్లో సొమ్ము పోగొట్టుకోగా 416 కేసుల్లో రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. దోపిడీలు, దొంగతనాల నివారణలో సీసీఎస్ 122 కేసులను ఛేదించింది. రూ. 1.30 కోట్లు విలువ చేసే బంగారం, 690 గ్రాముల వెండి, రూ. 12లక్షల నగదు, టన్ను కాపర్, 14 ద్విచక్ర వాహనాలు, స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన పలువురు నిందితులను అరెస్టు చేశారు.

నేరాలు ఇలా..

హత్యలు:36, హత్యాయత్నం: 83, దోపిడీలు: 15, మోసాలు: 1449 కిడ్నాప్‌లు: 208 రోడ్డు ప్రమాదాలు: 1102 సైబర్ నేరాలు: 616 మత్తు పదార్థాల కేసులు: 80 ఉద్యోగాల పేరుతో మోసం: 47 మహిళలపై వేధింపులు::553 అత్యాచారాలు: 129 వరకట్న హత్యలు: 14 మహిళాల హత్యలు: 13

పంచ పథకాలతో విద్యాప్రగతి

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది విద్యాశాఖకు ప్రత్యేక నిధులు కేటాయించింది. సర్కారు పాఠశాలల్లో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యను అందించడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. మన ఊరు–మనబడి: పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడానికి ఈ కార్యక్రమం చేపట్టింది. తొలి విడతలో 223 పాఠశాలల్లో రూ.58 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ఇప్పటి వరకు 172 పాఠశాలల్లో రూ.5.50 కోట్ల పనులు ప్రారంభమయ్యాయి. తొలిమెట్టు: ప్రాథమిక స్థాయి విద్య పటిష్ఠతకు ఈ కార్యక్రమం ప్రారంభించింది. జిల్లాలో 479 ప్రాథమిక పాఠశాలల్లో 17,391 మంది చిన్నారులు అభ్యసిస్తున్నారు. వారిలో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడానికి భాష, గణిత సామర్థ్యాల సాధనకు శ్రీకారం చుట్టింది. సౌరకాంతులు: ప్రభుత్వ పాఠశాలలపై విద్యుత్తు భారాన్ని తగ్గించేందుకు సౌర విద్యుత్తు సౌకర్యాన్ని కల్పించాలని నిర్ణయం తీసుకుంది. తొలి విడతలో 35 బడులను ఎంపిక చేశారు. ఆయా బడుల్లో సౌర ఫలకాలు ఏర్పాటు చేయనున్నారు. పీఎంశ్రీ అంతర్జాతీయ స్థాయి విద్యతో పోటీ పడేలా ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతీకరించేందుకు పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా)కి శ్రీకారం చుట్టింది. కేంద్రం ప్రభుత్వం జిల్లాలో 130 పాఠశాలలను గుర్తించగా, వీటిలో మండలానికి రెండు చొప్పున జిల్లా విద్యాశాఖ 13 మండలాల్లో 26 పాఠశాలలు ఎంపిక చేయనుంది. ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు: 1 నుంచి 8వ తరగతి వరకు అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టింది. ఉపాధ్యాయులకు సబ్జెక్టులలో నిపుణులతో ఆంగ్లంపై ప్రత్యేక తర్ఫీదు ఇచ్చారు.

సాగు బాటలో మోదం.. ఖేదంవరంగల్ జిల్లాలో 2022 సంవత్సరం కర్షకులకు కొంత మోదం., కొంత ఖేదం మిగిల్చింది. వర్షాలు సమృద్ధిగా కురవడంతో సాగునీటికి కొరత లేకుండా పోయింది.

# గడువులోగా పూర్తయ్యేనా?



కరీంనగర్ : కరీంనగర్ నగరవాసులకు అన్ని హంగులతో కొత్త మార్కెట్లు నిర్మించేందుకు నగర పాలక సంస్థ చర్యలు చేపట్టింది. ప్రస్తుతమున్న ప్రధాన కూరగాయల మార్కెట్ సరిపోవడం లేదు. లోపలి భాగంలో స్థలం లేకపోవడంతో రోడ్ల మీద, టవర్‌సర్కిల్ ప్రాంతంలో దుమ్ము, ధూళిలో అమ్ముతున్నారు. వీటికి చెక్ పెట్టేందుకు, నగరవాసుల మేలు కోరి వెజ్, నాన్‌వెజ్ లభించేలా సమీకృత మార్కెట్లు నిర్మించేందుకు పట్టణ ప్రగతి, స్మార్ట్‌సిటీ కింద ప్రతిపాదనలు చేసి సర్కారు పనులు మొదలుపెట్టింది. కొన్ని ఆలస్యంగా మొదలైనా.. ఆ తర్వాత గాడీలో పడ్డాయి. ఇటీవల జిల్లా అదనపు పాలనాధికారి గరిమ అగ్రవాల్ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. వీటి నిర్మాణ పనుల తీరుపై కథనం.

సౌకర్యాలు ఇవే..

సమీకృత మార్కెట్లు నగరవాసులకు అందుబాటులోకి వస్తే అన్ని వస్తువులు ఒకే దగ్గర దొరికేలా నిర్మాణ పనులకు ప్రతిపాదనలు చేశారు. కూరగాయలు, మాంసం, చేపల స్టాళ్లు వేర్వేరుగా ఉండనున్నాయి. పూలు, పండ్ల దుకాణాలు ఏర్పాటు చేస్తారు. లోడింగ్, అన్‌లోడింగ్, ప్లాట్‌ఫాంలు, సులభ్‌కాంప్లెక్స్, ప్రహరీ, పచ్చదనం, కార్యాలయ గదులు ఇందులో ఉంటాయి.

గడువులోగా పూర్తయ్యేనా?

కశ్మీర్‌గడ్డలో ఇంకా ప్రారంభించకపోగా, కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదురుగా భవనాన్ని కూల్చేందుకు ఆలస్యమైంది. ఈ రెండు చోట్ల మినహాయిస్తే మిగతా కిసాన్‌నగర్, పద్మానగర్‌లో నిర్ణీత గడువులోగా పూర్తి కావాలి. అయితే ఇచ్చిన సమయం దాటిపోగా వచ్చే ఏడాది మార్చి 31లోగా పనులు పూర్తి కావాలని ఇప్పటికే రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్, నగర మేయర్ వై.సునీల్‌రావు అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే.

నిధులపై తర్జనభర్జన..

నగరంలో ప్రారంభించిన సమీకృత మార్కెట్ల పనులు చేస్తుండగా కేటాయించిన నిధులు సరిపోవని ఇంజినీరింగ్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. డిజైన్లు ఇవ్వడంలో ఆలస్యం చేయగా, అప్పటికే పనులు ప్రారంభించారు. అయితే వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు అందుబాటులోకి తీసుకొచ్చేలా భవన నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. మూడు చోట్ల కలిపి రూ.6 కోట్లు అదనంగా అవసరమని అధికారులు చెబుతున్నారు. ఒకసారి డిజైన్లు ఇచ్చిన తర్వాత మార్చకుండా పనులు జరిపించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. నిధులు మంజూరు కాకపోతే మధ్యలోనే నిలిచిపోయే ప్రమాదముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రూ.39.90 కోట్లతో నాలుగు చోట్ల..నగరంలో నాలుగు చోట్ల సమీకృత మార్కెట్లు నిర్మించేందుకు రూ.39.90 కోట్లు కేటాయించారు. కిసాన్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో 1.88 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్నారు. మొత్తం 146 దుకాణాలు ఉంటాయి. లిఫ్టు సౌకర్యాన్ని కల్పించనున్నారు. ప్రస్తుతం జీ1 శ్లాబు వేయగా, రెండో వైపు శ్లాబు వేసేందుకు పనులు సాగుతున్నాయి. దుకాణాల వారీగా అరలు నిర్మించారు.కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదురుగా 2.31 ఎకరాల స్థలం ఉండగా, ఇందులో మొత్తం 347 దుకాణాలు అందుబాటులో ఉండనున్నాయి. ప్లింత్ లెవల్, కాలమ్స్ వేయగా శ్లాబు కోసం చర్యలు చేపట్టారు. పద్మానగర్‌లో 2.08 ఎకరాల స్థలంలో మార్కెట్ నిర్మించేందుకు పనులు చేస్తుండగా మొత్తం 239 దుకాణాలు నిర్మిస్తారు. కశ్మీర్‌గడ్డలో ప్రస్తుతం రైతుబజారు స్థలంలోనే నిర్మించనున్నారు. వ్యాపారుల కోసం పక్కనే తాత్కాలిక షెడ్లు వేయించగా వీరికి అక్కడికి తరలించి పాత షెడ్డు పూర్తిగా కూల్చివేయనున్నారు. దీనికోసం స్మార్ట్‌సిటీలో రూ.10 కోట్లు కేటాయించారు. డిజైన్ ప్రకారం పార్కింగ్, కూరగాయల వ్యాపారులు కూర్చోవడానికి అనువైన స్థలం కేటాయిస్తారు.

# దశాబ్దం దాటినా దక్కని పరిహారం

గంగాధర : ఉమ్మడి జిల్లాలోని రైతాంగానికి వరప్రదాయనిగా ఉన్న గంగాధర, నారాయణపూర్ జలాశయాల కింద ముంపు బాధితులు ఏళ్లుగా ముప్పుతిప్పలు పడుతున్నారు. విలువైన వ్యవసాయ భూములు, బావులు, ఇళ్లు ఇలా సర్వస్వం కోల్పోయి దశాబ్దాలు గడిచినా పరిహారం అందక బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా రెండు పంటల సాగు సమయంలో ఈ రెండు జలాశయాలకు ఎల్లంపల్లి ప్రాజెక్టు ఆధారంగా నీటిని ఎత్తిపోసి ఇక్కడి నుంచి వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లోని చెరువులు, కుంటలు నింపుతున్నారు. వీటిని ఆధారం చేసుకుని కాలువల ఆధారంగా దాదాపు 1.50 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తుండగా చేతినిండా పంటలు పండుతున్నాయి. తమకు మాత్రం ముంపు బాధలు తొలగిపోవడం లేదని నారాయణపూర్, మంగపేట, చర్లపల్లి ఎన్, ఇస్తారుపల్లి గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పరిహారం మంజూరు చేసినా తమ గ్రామాల్లోని ఇళ్లను పూర్తిగా స్వాధీనం చేసుకుని ప్రత్యేక స్థలంలో పునరావాసం కింద ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆందోళన చేపట్టడంతో మంజూరైన నష్టపరిహారం నిధులు వెనక్కిమళ్లాయి. వర్షాకాలంలో భారీ వరదలకు నారాయణపూర్, గంగాధర చెరువుల కట్టలకు గండ్లు పడడంతో నీటిని నింపేందుకు అధికార యంత్రాంగం యంత్రాలతో అక్కడకు పలుసార్లు వెళ్లగా మంగపేట, నారాయణపూర్ గ్రామాల ముంపు బాధితులు అడ్డుకున్నారు. తమ సమస్యలు తొలగించాకే పనులు చేపట్టాలని డిమాండు చేస్తున్నారు.

సర్వత్రా ఆవేదన గంగాధర, నారాయణపూర్ చెరువుల సామర్థ్యం పెంచేందుకు 2005లో అప్పటి ప్రభుత్వం రూ.24 కోట్లు మంజూరు చేసింది. చెరువుల మత్తడి ఎత్తు పెంచి కట్టలకు మాత్రం మరమ్మతులు చేపట్టలేదు. చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెంచలేదు. ఫలితంగా వర్షాకాలంలో రెండు చెరువుల కట్టలకు గండ్లు పడి నీరంతా వృథాగా పోయింది. 1.4 మీటర్ల మేరకు చెరువుల కట్టలు పెంచి నీటి నిల్వ సామర్థ్యం 0.3 టీఎంసీలుగా నిర్ణయించినా పనులు జరగక కేవలం నీటిని ఎత్తిపోసేందుకు మాత్రమే వీటిని వినియోగిస్తున్నారు. నారాయణపూర్ శివారులో 150 ఎకరాలు, మంగపేటలో 88 ఎకరాలతోపాటు వ్యవసాయ బావులకు ఏళ్లుగా పరిహారం మంజూరు కాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. నారాయణపూర్ చెరువు కట్ట దిగువన 25 ఇళ్లు, మంగపేటలో 11 ఇళ్లు, చర్లపల్లి ఎన్ గ్రామంలో పలు ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని గతంలోనే అధికారులు గుర్తించి మార్కవుట్ కూడా ఇచ్చారు. ఏళ్లు గడిచినా వారికి మాత్రం పరిహారం అందలేదు. తమ గ్రామాలను పూర్తిగా ముంపు కింద గుర్తించి ప్రత్యేక పునరావాసం కింద ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

అప్పుడు ఊరు విడిచి వెళ్లిపోయాం –మ్యాకల గంగారాం, నారాయణపూర్

నారాయణపూర్ చెరువు కట్ట దిగువన ఉన్న ఇళ్లలో నరకయాతన పడుతున్నాం. కట్టను ఆనుకుని ఉన్న ఇళ్లలోకి వానాకాలం ఊట వస్తుంది. గోడలు తడిసి కూలిపోయే పరిస్థితి ఉంటుంది. ముంపు కింద గుర్తించి మార్కవుట్ ఇచ్చిన అధికారులు.. ఏళ్లు గడిచినా పరిహారం చెల్లించలేదు. ఇటీవల చెరువు కట్టకు గండి పడడంతో ఊరు విడిచి వెళ్లిపోయాం. ప్రత్యేకంగా కేటాయించిన చోట తలదాచుకున్నాం. పునరావాసం కల్పించి ఆదుకోవాలి.

భూమికి ఇచ్చి.. బావికి ఇంటికి ఇవ్వలేదు – మదుపు తిరుపతిరెడ్డి, మంగపేట

ఇస్లాంపూర్ శివారులో ఎకరా భూమితో పాటు వ్యవసాయ బావి కోల్పోయాను. భూమికి పరిహారం ఇచ్చిన అధికారులు.. బావికి రావాల్సిన పరిహారం డబ్బులు రూ.6.80 లక్షలను 8 ఏళ్ల కిందట ఇతరులకు ఇచ్చారు.

# లక్షల వ్యయం... లక్ష్యంపై నిర్లక్ష్యం..!

కరీంనగర్ :పట్టణ ప్రగతిలో షీ బయోటాయిలెట్ బస్సును రూ.లక్షలు వెచ్చించి ఉపయోగంలోకి తీసుకొచ్చారు. ప్రతి ఆరు నెలలకొకసారి బయో మీడియా మార్చితే తప్ప వ్యర్థాలను శుద్ధీకరణ చేయదు. రెండేళ్లుగా మార్చకపోగా బస్సు పైభాగాన ఉన్న ట్యాంకు, సోలార్ వైర్లు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సభలు ఉన్నప్పుడూ తప్ప మిగతా సమయాల్లో బల్దియా ఆవరణలోనే నిలిచి ఉంటుంది. కరీంనగర్ నగరపాలికతోపాటు ఇతర మున్సిపాలి టీల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, ఇతర విభాగాల్లో యాంత్రీకరణ పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు ఇస్తున్నాయి. ఆ దిశగా చర్యలు తీసుకునే విధంగా నిధులు కూడా విడుదల చేస్తుండడంతో ఆయా బల్దియాల్లో వాహనాల కొనుగోలు పెరిగింది. నగరంలోనూ పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా కోసం ట్యాంకర్లు, ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోలు, ఎక్కువగా సమకూర్చుకుంటున్నారు. స్మార్ట్‌సిటీలో భాగంగా కంప్యాక్టర్ వాహనం కొనుగోలు చేశారు. సఫాయిమిత్ర సురక్ష ఛాలెంజ్‌లో భాగంగా పలు రకాల వాహనాలతో మురుగునీటి కాల్వలు శుభ్రం చేస్తుండడం, సెప్టిక్ ట్యాంకులను క్లీనర్స్ వాడడంతో అందులో మెరుగైన ర్యాంకు సాధించి దేశవ్యాప్త గుర్తింపు సాధించిన విషయం తెలిసిందే.

వాహనాల నిర్వహణ లేకనే..వాహనాలను రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తుండగా కొన్నింటిని వాడకుండా మూలన పడేశారు. ఎప్పుడో ఒకసారి ఉపయోగపడే డీఆర్ఎఫ్ బస్సు(వ్యాన్), షీ టాయిలెట్ బస్సు ఉండగా నిత్యం ఉపయోగించుకోకపోవడంతో దాని విడిభాగాలు చెడిపోతున్నాయి. దెబ్బతిన్న వాహనాలకు సకాలంలో మరమ్మతులు లేకపోవడంతో అవి పనికి రాకుండా తయారయ్యాయి. ఆరు నెలలుగా ప్రత్యేకంగా షెడ్డు ఏర్పాటు చేయగా పారిశుద్ధ్య ట్రాక్టర్లకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. కొనుగోలు చేసిన వాహనాలు వినియోగంలోకి తీసుకొస్తే యంత్రాలు ఎక్కువకాలం పని చేసే అవకాశముంటుంది.

పాడైన ట్రాక్టర్లు, ఆటోలు..పారిశుద్ధ్య పనుల కోసం నిత్యం వినియోగిస్తున్న ట్రాక్టర్లు, ఆటోలు, డంపర్‌ప్లేసర్ వాహనాలు తరచూ మొరాయిస్తున్నాయి. డబ్బాలకు అయితే తాడు కట్టి చెత్తను తరలిస్తున్నారు. రెండు వ్యాన్లు ఉండగా ఒకటి పూర్తిగా మూలన పడడంతో డంపర్‌బిన్స్ తరలించేందుకు అవస్థలు తప్పడంలేదు. వీటిలో కొన్నింటికి కాలపరిమితి ముగిసింది. డివిజన్‌కు ఒక ట్రాక్టర్, రాత్రి పూట ఊడ్చే చెత్త తరలించేందుకు ఆటోలు కొనుగోలు చేయాలనే డిమాండ్ అధికంగా ఉంది.బల్దియాలో రెండు బ్లేడ్ ట్రాక్టర్లు ఉండగా ఒకటి పూర్తిగా పాడైంది. నిర్వహణ లేకపోవడం, తరచుగా మరమ్మతులు రావడంతో దానిని మూలన పడేశారు. ప్రస్తుతం పనికి వచ్చే స్థితిలో కూడా లేదంటున్నారు. అదొక్కటి ఎప్పటికీ ఉపయోగపడగా, అవసరాలకు లేకపోవడంతో జేసీబీతోనే పనుల చేపడుతున్నారు.

స్మార్ట్‌సిటీలో భాగంగా హౌసింగ్‌బోర్డుకాలనీలోని రీసోర్స్ పార్కులో కంప్యాక్టర్ స్టేషన్ నిర్మించగా చెత్తను తగ్గించి తరలించేందుకు వీలుగా భారీ వాహనాన్ని కొనుగోలు చేశారు.

# పథకం పారట్లేదు..!

మహబూబాబాద్ : జిల్లాలో పాకాల, మున్నేరు, ఆకేరు, పాలేరు వాగుల్లో వరద పోటెత్తుతోంది. ఆయకట్టుకు సాగునీరిందించా లనే లక్ష్యంతో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు పూర్తి స్థాయిలో పనిచేయడం లేదు. బాగు చేసి సాగునీరు అందించాలంటూ పాలకుల కు, అధికారులకు అన్నదాతలు చేసిన విజ్ఞప్తులు కార్యరూపం దాల్చడం లేదు. దాంతో వినియోగంలో ఉండాలని విలువైన యంత్ర పరికరాలు తుప్పుపట్టిపోతున్నాయి. ఇప్పటికైన సంబంధిత ఇంజినీరింగ్ అధికారు లు వాటికి పూర్వవైభవం తీసుకువచ్చేలా దృష్టిసారించాలని కర్షకులు కోరుతున్నారు.8 పథకాలు ప్రశ్నార్థకంరూ. కోట్లు వెచ్చించి జిల్లాలో సుమారు 11 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరిందించడానికి 18 ఎత్తిపోతల పథకాలు నిర్మించగా అందులో పది పని చేస్తున్నాయి. మహబూబాబాద్, గూడూరు, కురవిలో ఒక్కొక్కటి చొప్పున, డోర్నకల్‌లో రెండు, గార్లలో మూడు చొప్పున పథకాలు మూలకు చేరాయి. వీటి కింద సుమారు 3,500 ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది.మండలం: గార్ల ప్రదేశం: అంజనాపురం పాకాల వాగుపై వ్యయం(రూ.లక్షల్లో): 6 ఆయకట్టు (ఎకరాలు): 400ప్రస్తుత పరిస్థితి: మరమ్మతులు లేక నిరుపయోగం15 ఏళ్ల కిందట నిర్మించారు. సుమారు ఆరేళ్ల వరకు దాని ఆయకట్టు పరిధిలోని 120 మంది రైతుల పంటపొలాలకు సాగునీరు అందించింది. ఆ తరువాత కొన్ని పరికరాలు పనిచేయలేదు. అప్పటి ఎంపీ నిధులు రూ. 4 లక్షలతో మరమమ్మతు చేయడంతో కొంత కాలంగా పనిచేసింది. మళ్లీ పరికరాలు పాడవ్వడంతో సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కురవి లక్ష్మీనారాయణపురం, మున్నేరు వాగుపైనిర్మాణం : 1982 12.35 400పథకం మరమ్మతులకు నోచుకోక పనిచేయడం లేదులక్ష్మీనారాయణపురం, కొత్తూరు(జి) ప్రాంతాల్లోని మున్నేరు వాగుపై 36 ఏళ్ల కిందట నిర్మించారు. 2005లో 16 గంటలపాటు విద్యుత్తు సరఫరా అయ్యేలా సౌకర్యం కల్పించారు. ఆయకట్టుకు సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తప్పాయని అన్నదాతలు హర్షించారు. పథకం పాడవ్వడంతో నిరాశకు గురయ్యారు. విద్యుత్తు సరఫరా అస్తవ్యస్తంగా మారింది. మోటార్లు పనిచేయక తుప్పు పట్టిపోయాయి.



# గంగమ్మ ఉగ్రరూపం.. హరిద్వార్‌కు అలర్ట్

దే(హ్రా)దూన్: భారీ వర్షాలతో ఉత్తరాది రాష్ట్రాలు అతలాకుతలమవుతున్నాయి. నదులు ఉప్పొంగడంతో వరదలు సంభవించి జనజీవనం అస్తవ్యస్తమైంది. అటు ఢిల్లీలో యమునా నది ఇంకా ప్రమాదకర స్థాయి పైనే ప్రవహిస్తుండగా.. ఇప్పుడు ఉత్తరాఖండ్‌లో గంగా నది ఉగ్రరూపం దాల్చింది. భారీ వర్షాలతో అలకనంద నదిపై ఉన్న జీవీకే హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ డ్యామ్ నిండటంతో దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో దేవప్రయాగ వద్ద గంగా నది ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తోందని అధికారులు తెలిపారు. హరిద్వార్‌లో గంగానది వార్నింగ్ స్థాయి అయిన 293 మీటర్లను దాటి ప్రమాదకరంగా మారింది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలకు అధికారులు అలర్ట్ జారీ చేశారు. వరద ప్రభావం ఉన్న ప్రాంతాల్లో ప్రజలను ఇప్పటికే శిబిరాలకు తరలించారు. హరిద్వార్, రూర్కీ, ఖాన్‌పూర్, భగవాన్‌పూర్, లస్కర్ పరిధిలోని అనేక గ్రామాల్లో వరద నీరు చేరి ప్రజలు అవస్థలు పడుతున్నారు. భారీ వర్షాలకు ఉత్తరాఖండ్ వ్యాప్తంగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో అనేక చోట్ల రహదారులపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాల కారణంగా 17 రోడ్లు, తొమ్మిది వంతెనలు దెబ్బతిన్నాయి. అటు సోమవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురవనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఉత్తరాఖండ్‌లోని 13 జిల్లాలకు నేడు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.

**మళ్లీ ఉప్పొంగుతున్న యమునా నది..** అటు దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది మళ్లీ ఉప్పొంగుతోంది. నీటిమట్టం ఇంకా ప్రమాదకర స్థాయి పైనే ఉంది. సోమవారం ఉదయం 8 గంటలకు నది నీటిమట్టం 205.50 మీటర్లుగా ఉండగా.. 9 గంటల సమయానికి 205.58 మీటర్లకు పెరిగింది. ఎగువ నుంచి భారీగా వరద ప్రవాహంతో పాటు భారీ వర్షాలు కూడా పడే అవకాశం ఉండటంతో నీటిమట్టం మరింత పెరగొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో పాత ఢిల్లీ యమునా వంతెనకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. మరోవైపు, ఢిల్లీలో వరద ప్రభావం కొనసాగుతూనే ఉంది. ఎర్రకోట, రాజ్‌ఘాట్ తదితర ప్రాంతాల్లో ఇంకా నీరు నిలిచే ఉంది.

# రవాణా రంగంలో సంస్కరణలపై దృష్టిపెట్టాలి: సీఎం జగన్



గుంటూరు: రాష్ట్రంలో ఆదాయం తీసుకొచ్చే శాఖలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరం మొదటి మూడునెలల్లో విభాగాల వారీగా రెవెన్యూ వసూళ్ల పనితీరును సీఎం సమీక్షించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ (కాంపెన్‌సేషన్ కాకుండా) పన్నుల వసూళ్లు జూన్ వరకూ 91శాతం లక్ష్యం చేరినట్లు అధికారులు వెల్లడించారు. జూన్ వరకూ రూ. 7,653.15 కోట్ల జీఎస్టీ పన్నుల వసూళ్లు అయ్యాయని, గత ఏడాదిలో ఇదే కాలంతో పోలిస్తే 23.74 శాతం జీఎస్టీ వసూళ్ల పెరుగుదల కనిపించిందని అధికారులు సీఎం జగన్‌కు వివరించారు. గతంతో పోలిస్తే మద్యం అమ్మకాలు తగ్గాయని, అదే సమయంలో ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. 2018-19తో పోలిస్తే.. తగ్గిన మద్యం అమ్మకాలు.

2018-19లో లిక్కర్ అమ్మకాలు 384.36 లక్షల కేసులు కాగా, 2022-23లో 335.98 లక్షల కేసులు. 2018-19లో బీరు అమ్మకాలు 277.16 లక్షల కేసులుకాగా, 2022-23లో 116.76 లక్షల కేసులు. 2018-19 ఏప్రిల్, మే, జూన్ నెలలతో పోల్చిచూస్తే, 2023-24లో ఏప్రిల్, మే, జూన్ నెలలో బీరు అమ్మకాల్లో మైనస్ 56.51 శాతం తక్కువ అమ్మకాలు నమోదయ్యాయని, లిక్కర్ అమ్మకాల్లో మైనస్ 5.28 శాతం తక్కువ అమ్మకాలు నమోదయ్యాయని అధికారులు వెల్లడించారు.

# ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండాలి: ప్రజలకు చంద్రబాబు సూచన



అమరావతి: రాష్ట్రంలో జూలై 21 నుంచి నెల రోజుల పాటు జరిగే ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పట్ల ఏపీ ప్రజలు పూర్తి అప్రమత్తంగా ఉండాలని తెలుగుదేశం అధినేత చంద్రబాబు సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వచ్చి చేపట్టే ఓటర్ వెరిఫికేషన్‌లో తమ ఓటు ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలన్నారు. ఓటు లేకపోతే తక్షణమే ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు అందరి బాధ్యతన్న చంద్రబాబు.. ఓటుతోనే భద్రత, భవిష్యత్తుకు భరోసా అని స్పష్టం చేశారు. ఈ మేరకు 'ఓటు మన బాధ్యత.. ఓటుతో భద్రత' అని పేర్కొంటూ ఆయన ట్వీట్ చేశారు.

# కుప్పంలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన.. కళాశాలలకు సెలవు!



కుప్పం పట్టణం: చిత్తూరు జిల్లా కుప్పం పురపాలిక పరిధిలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కుప్పం ప్రభుత్వం జూనియర్ కళాశాల ఆవరణలో సభ ఏర్పాటు చేశారు. పర్యటనలో భాగంగా కళాశాలలో నాడు-నేడు పనులను మంత్రి పరిశీలించారు.

అనంతరం సభలో పాల్గొన్నారు. ఈ సభ సందర్భంగా ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని జూనియర్, ఒకేషనల్ కళాశాలలకు సెలవు ప్రకటించారు. దీంతో విద్యార్థులు ఇళ్లకు చేరుకున్నారు.



# 'ఎన్నికల ప్రచారంలో ఈడీ..!'

చెన్నై: మనీలాండింగ్ కేసుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా తమిళనాడు మంత్రి కె. పొన్ముడి నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోమవారం సోదాలు చేపట్టారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. ఈడీ 'ఎన్నికల ప్రచారంలో' చేరిందంటూ దర్యాప్తు సంస్థపై ఘాటు విమర్శలు చేశారు. 2007-2011 మధ్య గత డీఎంకే ప్రభుత్వంలో పొన్ముడి గనుల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో క్వారీ లైసెన్సు నిబంధనలను ఉల్లంఘించారని, గనుల కేటాయింపుల విషయంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఇందులో భాగంగానే సోమవారం ఉదయం పొన్ముడి, ఆయన కుమారుడు, ఎంపీ గౌతమ్ సిగమణి పొన్ నివాసాలు, కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు జరిపారు.

**వ్యూహాలకు పదును.. అధికార, విపక్షాల బల ప్రదర్శనకు రంగం సిద్ధం** : కాగా.. మనీలాండరింగ్ కేసులో రాష్ట్ర మంత్రి సెంథిల్ బాలాజీని ఈడీ గత నెల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. రోజుల వ్యవధిలోనే మరో మంత్రిపై ఈడీ దర్యాప్తును ముమ్మరం చేయడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కుట్రపూరితంగానే తమ నేతలను తప్పుడు కేసుల్లో ఇరికిస్తోందని డీఎంకే మండిపడింది. విపక్షాల సమావేశం కోసం బెంగళూరు బయల్దేరిన సీఎం స్టాలిన్ తాజా సోదాలపై స్పందించారు. "ఇటీవలే పొన్ముడిపై ఉన్న రెండు కేసులను కోర్టు కొట్టేసింది. ఇప్పుడు ఈడీ సోదాలు చేపట్టింది. ప్రతిపక్షాల భేటీ నుంచి ప్రజల దృష్టికి మళ్లించేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే మా కోసం తమిళనాడు గవర్నర్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఈడీ కూడా ఈ ప్రచారంలో చేరింది. ఇక మా ఎన్నికల పని సులువుగా అవుతుందని భావిస్తున్నా" అంటూ సీఎం వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఎన్నికల వేళ ఈడీ చేపట్టే ఈ దాడులు సాధారణమేనని, ఇలాంటి బెదిరింపులకు డీఎంకే భయపడదని అన్నారు.

**మోదీ ప్రభుత్వం స్క్రిప్ట్: కాంగ్రెస్ –** అటు కాంగ్రెస్ కూడా ఈ సోదాలను తీవ్రంగా ఖండించింది. "విపక్షాల భేటీకి ముందు తమిళనాడు మంత్రిపై దాడులు జరగడాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. విపక్షాలను విడగొట్టేందుకు మోదీ ప్రభుత్వం రాసిన స్క్రిప్ట్ ఇది. మోదీ ప్రభుత్వం పాల్పడుతున్న ఈ రాజకీయ కుట్రలపై పోరాడేందుకు విపక్షాలన్నీ ఏకమయ్యాయి. ప్రజాస్వామ్యాన్ని అణచివేసేందుకు చేసే ఈ ప్రయత్నాలకు మేం ఎన్నడూ తలొగ్గం" అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు.



# అంజూ యాదవ్‌కు అండ ఎవరు..?

**నడిరోడ్డుపై విపక్ష నాయకులపై చేయిచేసుకున్నా, సాటి మహిళను బూటుకాళ్లతో తన్ని వివస్త్రను చేసి ఈడ్చుకెళ్లినా, ఆ అధికారిణిపై ఎలాంటి చర్యలు ఉండవు. కేవలం ఛార్జిమెమోతో సరిపెట్టేశారు. బాధ్యత కలిగిన పదవిలో ఉంటూ తొడగొట్టి సవాళ్లు విసురుతున్నా, ఉన్నతాధికారులు కనీసం మందలిచ్చే సాహసం చేయడం లేదు. శ్రీకాళహస్తి సీఐ అంజూయాదవ్ అవినీతి, అక్రమాలపై ఫిర్యాదులు ఉన్నా సరైన చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులు వెనకాడుతున్నారు. అధికార పార్టీ అండ ఉండటం వల్లే ఈ అరాచకాలు చేస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.**



# శ్రీకాళహస్తి సీఐపై చర్యలు తీసుకోండి

తిరుపతి: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తిరుపతి చేరుకున్నారు. శ్రీకాళహస్తి సీఐ అంజూయాదవ్‌పై తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డికి ఆయన ఫిర్యాదు చేశారు. తొలుత గన్నవరం విమానాశ్రయం నుంచి రేణిగుంట చేరుకున్న ఆయన.. అక్కడి నుంచి తిరుపతికి వచ్చారు. జనసేన కార్యకర్తలతో కలిసి భారీగా ర్యాలీగా ఎస్పీ కార్యాలయానికి చేరుకుని అక్కడ వినతిపత్రం అందజేశారు.

**వివాదాస్పద అధికారిణిపై చర్యలేవీ? :** ఇటీవల శ్రీకాళహస్తిలో జనసేన నాయకుడు కొట్టే సాయిపై సీఐ అంజూయాదవ్ చేయిచేసుకున్నారు. దీన్ని జనసైనికులు తీవ్రంగా ఖండించారు. ఈ క్రమంలోనే పవన్ తిరుపతి చేరుకుని జిల్లా ఎస్పీని కలిసి సీఐపై చర్యలు తీసుకోవాలని కోరారు.



## పిడుగుల అలజడి

# అమెరికాలో 2,600 విమానాల రద్దు

అమెరికాలో పిడుగులతో కూడిన వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. దీని కారణంగా దాదాపు 2,600 విమాన సర్వీసులను రద్దు చేశారు. దీంతోపాటు మరో 8,000 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముఖ్యంగా దేశంలోని ఈశ్యాన్య ప్రాంతంలో ఈ పరిస్థితి నెలకొన్నట్లు స్థానిక పత్రికలు పేర్కొన్నాయి. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ సమాచారం ప్రకారం.. ఈశ్యాన్య ప్రాంతంలో 1,320 విమాన సర్వీసులు రద్దు కాగా.. వాటిల్లో 350 న్యూజెర్సీలోని న్యూఆర్క్ లిబర్టీ అంతర్జాతీయ విమానాశ్రయంలోనే ఉన్నాయి. దీంతోపాటు జాన్ ఎఫ్ కెన్నడీ ఎయిర్‌పోర్ట్, లా గార్డియన్ ఎయిర్ పోర్టుల్లో పలు సర్వీసులు రద్దు చేశారు. జేఎఫ్‌కే విమానాశ్రయంలో 318 రద్దు కాగా.. 426 సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇక లా గార్డియన్‌లో 270 సర్వీసులు రద్దుకాగా.. 292 ఆలస్యంగా ప్రయాణిస్తున్నాయి. చాలా విమానయాన సంస్థలు అడ్వైజరీలను ట్విటర్‌లో పోస్టు చేశాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు బయల్దేరే ముందు.. మరోసారి విమాన సమయాలను, వాతావరణ పరిస్థితులను చెక్ చేసుకోవాలని సూచించాయి. ఈశాన్య అమెరికా ప్రాంతంలో భారీ వర్షాలు పడుతుండటంతో పలు చోట్ల వరదలొస్తున్నాయి.

**కుతకుతలాడుతున్న ప్రపంచం :** న్యూయార్క్, న్యూజెర్సీ, కనెటికట్, పెన్సిల్వేనియా, మాస్సాచుసెట్స్, వెర్మాంట్ ప్రాంతాల్లో ఇప్పటికే అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా మెరుపు వరదలు సంభవించే అవకాశం ఉందని నేషనల్ వెదర్ సర్వీస్ పేర్కొంది. ఇక కనెటికట్, మస్సాచుసెట్స్, న్యూహాంప్‌షైర్, న్యూయార్క్, రోడే దీవిలో టోర్నడో వచ్చే ప్రమాదం ఉందని కూడా హెచ్చరికలు జారీ అయ్యాయి. మరోవైపు అమెరికాలోని దక్షిణ, పశ్చిమ ప్రాంతాల్లో మాత్రం ఎండలు దంచి కొడుతున్నాయి. ఆదివారం రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వార్తలొస్తున్నాయి. ఆదివారం కాలిఫోర్నియాలోని డెత్‌వ్యాలీలో ఏకంగా 52 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ భూమిపై అత్యంత వేడిగా ఉండే ప్రదేశాల్లో డెత్‌వ్యాలీ కూడా ఒకటి.

కాలిఫోర్నియా నుంచి టెక్సాస్‌దాకా శక్తిమంతమైన వేడి గాలులు వీస్తున్నాయని అమెరికా జాతీయ వాతావరణ సంస్థ వెల్లడించింది. సాధారణంకంటే 10 నుంచి 20 డిగ్రీల ఫారన్‌హీట్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపింది. ఆరిజోనా రాష్ట్రంలో పగటి సమయం అధికంగా ఉంటోంది. రాజధాని ఫీనిక్స్‌లో వరుసగా 16 రోజులపాటు 109 డిగ్రీల ఫారన్‌హీట్ (43 డిగ్రీల సెల్సియస్) కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# నేడు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల



తిరుమల: రేపు తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల చేయనున్నట్లు తితిదే వెల్లడించింది. భక్తులకు సౌకర్యంగా ఉండేలా షెడ్యూల్ ప్రకారం ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల కోటాను విడుదల చేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు తితిదే ఓ ప్రకటన విడుదల చేసింది. అక్టోబర్ నెలకు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్‌లైన్ లక్కీడిప్ కోసం జులై 18న ఉదయం 10 గంటల నుంచి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చని తితిదే తెలిపింది. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన భక్తులు సొమ్ము చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను జులై 21న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. అక్టోబర్ నెల అంగ ప్రదక్షిణం టోకెన్ల కోటాను జులై 24న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. భక్తులు ఈ విషయాలను గమనించి https://tirupatibalaji.ap.gov.in వెబ్‌సైట్‌లో సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని తితిదే సూచించింది.

# శ్రీశైలం, శ్రీకాళహస్తిలో భారీగా భక్తుల రద్దీ

శ్రీశైలం, శ్రీకాళహస్తి: శివుడిని ప్రీతికరమైన సోమవారం రోజు అమావాస్య కలిసి రావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు శివాలయాలకు తరలివెళ్లారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాల వద్ద వేకువజాము నుంచే రద్దీ నెలకొంది. శ్రీశైలంలో మల్లన్న, భ్రమరాంబికా దేవిలను తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరాదికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. ఉచిత దర్శనానికి 6 గంటలు, అతి శీఘ్ర దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీతో శ్రీశైలంలోని పురవీధులు కిటకిటలాడుతున్నాయి. మరోవైపు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు వేకువజాము నుంచే బారులు తీరారు. రాహు కేతు సర్పదోష నివారణ పూజలు



చేయించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సిఫార్సులు, అడ్డదారిలో భక్తులను అనుమతించడంతో సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల తరబడి క్యూలైన్‌లో పడిగాపులు కాశారు.

## తొలి పారితోషికం చారిటీకి విరాళం ఇచ్చిన సితార!

మహేష్-నమ్రతల గారాల పట్టి సితార నటి కాకముందే? బ్రాండ్ అంబాసిడర్ అయిన సంగతి తెలిసిందే. ఓ ప్రముఖ జ్యూవెలరీ ని ప్రమోట్ చేస్తూ సితార చేసిన యాడ్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఈ యాడ్ కి సితార కోటి రూపాయలు పారితోషికం అందుకున్నట్లు సమాచారం. మరి తొలిపారితోషికం సితార ఏం చేసింది? వ్యక్తివత ఖర్చులకు పాకెట్ మనీగా ఉంచుకుందా? లేక మమ్మి డాడీలలో ఎవరికైనా ఇచ్చిందా? అన్న ఆసక్తికర ప్రశ్న సితార ముందుకెళ్లే సరికి ఎవరూ ఊహించని సమాధానం ఇచ్చింది సీతా పాప. ఓ ఛారిటీకి



విరాళంగా ఇచ్చినట్లు సితార తెలిపింది. సూపర్ స్టార్ లాగే తనయది కూడా మంచి మనసుని చెప్పొచ్చు. సూపర్ స్టార్ ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలకు గుండె ఆపరేషన్లు చేయిస్తున్నారు. ఇప్పటివరకూ ఎంతో మంది చిన్నారుల ప్రాణాలు కాపాడి ఆ తల్లిదండ్రుల కళ్లలో ఆనందం నింపారు మహేష్. ఏటా ఆయన కొన్ని వందల ఆపరేషన్లు కార్పోరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగానే చేయిస్తున్నారు. సితార కూడా తండ్రి లాగే సేవా కార్యక్రమాలు చేసే దృక్పదం ఉన్న అమ్మాయి లా కనిపిస్తోంది. ఇక నమ్రత సితార కెరీర్ గురించి చెప్పుకొచ్చింది. పిల్లలు ఇద్దరు ఏ రంగంలో రాణించాలనుకుంటే ఆ రంగంలోకి వెళ్తారు. మహేష్ గానీ...నేను గానీ వాళ్లపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాం. ఫలానా రంగంలోకి వెళ్లండని సలహాలుగానీ..బలవత్తం చేయడం గానీ చేయం. ఏ పనికి ప్రత్యేకమైన స్ట్రాటజీ అంటూ ఏమీ ఉండదు. సమయం వచ్చినప్పుడు వాటంతటవే జరిగిపోతుంటాయి. మహేష్ ఎప్పుడూ సినిమాలతో బిజీగా ఉంటారు. ఇంటి పనులతో నేను క్షణం తీరిక లేకుండా గడుపుతున్నాను. పిల్లలు వాళ్ల ఫ్యాషన్ గురించి పెద్దగా ఆలోచించలేదు. వాళ్ల ఫ్యాషన్ ఎటువైపు ఉంటే ఆటెళ్తారు. కానీ సితారకి సినిమాలంటే ఫ్యాషనేట్ గా ఉంటుంది. ఇక సితారకి ఈ యాడ్ లో నటించే అవకాశం ఎందుకు ఇచ్చారో? నాకు తెలియదు. ఆ విషయం వాళ్లనే అడగాలి అని అన్నారు.

## పాకిస్తాన్ లోనూ ఆ బ్యూటీకి అభిమాన సంఘాలు!

పాకిస్తాన్ నటులు..గాయకులకు ఇండియాలో చాలా మంది అభిమానులున్నారు. అందుకే బాలీవుడ్ లో ఇప్పటికీ పాక్ స్తాన్ కి చెందిన ఎంతో మంది కళాకారులు కొనసాగుతున్నారు. కొత్త వారు వెలుగులోకి వస్తున్నారు. వాళ్లని ప్రోత్సహిస్తున్నారు. కానీ పాకిస్తాన్ లో భారతీయ నటులకు అభిమానులున్నారా? అంటే అది చాలా తక్కువనే చెప్పాలి. పాకిస్తాన్ లో భారతీయ చిత్రాలు రిలీజ్ అవ్వడం అన్నది చాలా రేర్. ఒకవేళ అయినా నానా హంగామా చోటు చేసుకుంటుంది. అలాంటి సంఘటనలు ఇప్పటికే చాలాసార్లు జరిగాయి. మరి అలాంటి పాకిస్తాన్ లో ఓ యంగ్ బ్యూటీకి ఏకంగా అభిమాన సంఘాలే ఉన్నాయంటే? నమ్ముతారా? అంటే నమ్మాల్సిందే అంటోంది ప్రియా ప్రకాష్ వారియర్. కన్ను గీటి ఓవర్ నైట్ లో ఫేమస్ అయిన బ్యూటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఈ పాపులారిటీ



ఏకంగా భారతీయ భాషలన్నింటిలోనూ అవకాశాలు తెచ్చి పెట్టింది. తెలుగులో లో ఇప్పటికే 'చెక్' సినిమాలో నటించింద. త్వరలో 'బ్రో 'సినిమాతో మెప్పించడానికి రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాకిస్తాన్ లో తనకున్న ఫాలోయింగ్ గురించి తెలిపింది. 'ఇంటర్ నుంచి మోడలింగ్ చేస్తూనే కొన్ని షార్ట్ ఫిలింస్ చేసాను. డిగ్రీ మొదటి సంవత్సరంలో 'లవర్స్ డే' సినిమా లో అవకాశం వచ్చింది. ఆ సినిమాలో కన్నుగీటిన సన్నివేశం హైలైట్ అవ్వడంతో రాత్రికి రాత్రే స్టార్ అయిపోయాను. తెలుగు అభిమానులైతే ప్రియా ప్రియా చంపొద్దు అంటూ నా కోసం గుడి కట్టేసుకున్నారు. అప్పుడే నాకు పాకిస్తాన్ లోనూ పెద్ద ఎత్తున అభిమానులు ఉన్న సంగతి తెలిసింది. కన్ను గీటిన వీడియో పాకిస్తాన్న కుర్రకారుని కూడా కదిలిచింది. రోజు ఎన్నో వీడియోలు వస్తుంటాయి. కానీ దేనికి కనెక్ట్ కాని పాక్ అభిమానులు నా వీడియోకి కనెక్ట్ అయి మెసెజ్ లు పెట్టేవారు. బాగా చేసావని మెచ్చుకున్నారు. మీ కోసం ఇక్కడ అభిమాన సంఘాలే ఉన్నాయని వాళ్లు చెబుతుంటే నమ్మలేకపోయేదాన్ని. ఇలా కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలు 'ఒరు ఆదార్ లవ్' లో నా పాత్రని పెంచడానికి దోహద పడ్డాయి ' అని అన్నారు.




## టాప్ 10 బాక్సాఫీస్.. టాలీవుడ్ నైజాం కింగ్స్ ఎవరంటే..



తెలుగు రాష్ట్రాలలో దాదాపు అన్ని ఏరియాలలో కూడా ఇటీవల కాలంలో మార్కెట్ వాల్యూ అంతకంతకు పెరుగుతూనే ఉంది. ఇక తెలంగాణ సైడ్ చూస్తే నైజం మార్కెట్లో అయితే స్టార్ హీరోలు ప్రతిసారి కూడా ఊహించని స్థాయిలో రికార్డులను క్రియేట్ చేస్తున్నారు. కంటెంట్ క్లిక్ అయితే కొన్ని చిన్న సినిమాలు కూడా మంచి వసూళ్లను అందుకుంటున్నాయి. అయితే ఇప్పటివరకు నైజం ఏరియాలో అత్యధిక స్థాయిలో షేర్ కలెక్షన్స్ అందుకున్న టాప్ తెలుగు సినిమాల వివరాల్లోకి వెళితే.. రామ్ చరణ్ తేజ్ జూనియర్ ఎన్టీఆర్ కలిసి నటించిన బిగ్గెస్ట్ మల్టీ స్టారర్ మూవీ RRR ఏ స్థాయిలో విజయాన్ని అందుకుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దర్శకదీరుడు రాజమౌళి తెరపైకి తీసుకువచ్చిన ఆ సినిమా రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా మంచి కలెక్షన్స్ అందుకుంది. ముఖ్యంగా నైజాం ఏరియాలో అత్యధికంగా ఈ సినిమా 111.85 కోట్ల రేంజ్ లో షేర్ కలెక్షన్స్ అందుకొని మంచి ప్రాఫిట్ ను అందించింది. ఇక బాహుబలి 2 సినిమా ఈ రికార్డులో రెండవ స్థానంలో నిలిచింది. ప్రభాస్ రాజమౌళి కాంబినేషన్లో వచ్చిన ఈ బిగ్గెస్ట్ ఫ్యాన్ ఇండియా మూవీ నైజాం ఏరియాలో మొత్తంగా 68 కోట్ల షేర్ కలెక్షన్స్ అందుకుని అప్పటివరకు ఉన్న రికార్డులన్నిటిని కూడా బ్రేక్ చేసింది. ఇక ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన కెరీర్ లోనే అల..వైకుంఠపురములో సినిమాతో బిగ్గెస్ట్ సక్సెస్ అందుకున్నాడు. ఇక నైజాం ఏరియాలో ఈ సినిమా 44.88 కోట్ల షేర్ కలెక్షన్స్ అందుకొని టాప్ టెన్ లిస్టులో మూడవ స్థానంలో నిలిచింది. ఇక బాహుబలి 1 43 కోట్ల కలెక్షన్స్ తో నైజాం ఏరియాలో 4వ స్థానంలో కొనసాగుతోంది.

ఇక డబ్బింగ్ సినిమా అయినప్పటికీ కూడా KGF సెకండ్ చాప్టర్ తెలుగు రాష్ట్రాల్లో మంచి కలెక్షన్స్ సొంతం చేసుకుంది. ఈ సినిమాకు కేవలం నైజాం ఏరియాలోనే మొత్తంగా 42 కోట్ల రేంజ్ లో షేర్ కలెక్షన్స్ వచ్చాయి. అల్లు అర్జున్ పుష్ప 2 సినిమా 40 కోట్లకు పైగానే నైజాం ఏరియాలో కలెక్ట్ చేయగా.. మహేష్ బాబు సరిలేరు నీకెవ్వరు 39 కోట్లు అందుకుంది. ఇటీవల వచ్చిన ఆదిపురుష్ సినిమాకు నెగిటివ్ టాక్ గట్టిగానే వచ్చింది. అయినప్పటికీ ప్రభాస్ తన క్రేజ్ తో నైజాం ఏరియాలో 36 కోట్ల షేర్ వచ్చేలా చేశాడు. మెగాస్టార్ వాల్తేరు వీరయ్య 36.25 కోట్లను అందుకుంది. ఇక నైజాం ఏరియాలో పదవ స్థానంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ భీమ్లా నాయక్ 35 కోట్ల కలెక్షన్స్ తో కొనసాగుతోంది.

## ఎంటి బ్రో ఇలా షాకిచ్చావ్..!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మెగా మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ కలిసి చేస్తున్న సినిమా బ్రో. తొలిసారి మామ అల్లుళ్లు కలిసి నటిస్తుండటంతో ఈ మూవీపై ఎక్కువ అంచనాలు ఉన్నాయి. కాగా ఇప్పటి వరకు విడుదల చేసిన బ్రో మూవీ టైటిల్ పోస్టర్లు ఫ్యాన్స్ ని విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల టీజర్ విడుదల చేయగా విపరీతంగా ఆకట్టుకుంది. వింటేజ్ పవన్ లుక్ ఫ్యాన్స్ కి మరింత ఎక్కువ కిక్ ఇచ్చింది. కాగా తాజాగా ఈ చిత్ర షూటింగ్ పూర్తయ్యింది. ప్రస్తుతం డబ్బింగ్ తదితర పనులు జరుగుతున్నాయి. కాగా తాజాగా ఈ మూవీ గురించి సోషల్ మీడియాలో ఓ న్యూస్ చక్కర్లు కొడుతోంది. దాని ప్రకారం ఈ మూవీ రన్ టైమ్ చాలా తక్కువ అట. కేవలం 130 నిమిషాలతోనే సినిమాను పూర్తి చేశారని తెలుస్తోంది. అంటే రెండు గంటల 10 నిమిషాల్లోనే సినిమా ముగుస్తుంది. నిజానికి స్టార్ హీరోల సినిమాలు అంటే కనీసం రెండున్నర గంటలకు పైగా రన్ టైం ఉండేలా ప్లాన్ చేస్తారు. కానీ ఈ మూవీ రన్ టైమ్ తక్కువగా ఉందని వార్త రావడంతో ఫ్యాన్స్ షాకౌతున్నారు. సినిమా తొందరగా అయిపోయిన ఫీలింగ్ కలుగుతుందని దాని వల్ల ఎక్కువ మంది అసంతృప్తికి గురయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారట. దీనిపై ఇప్పటి వరకు అధికారిక ప్రటకన మాత్రం రాలేదు. మరి ఇందులో ఎంత వరకు నిజం ఉందో తెలియాల్సి ఉంది. కొన్నిసార్లు రన్ టైమ్ అనేది తక్కువ ఉంటే మంచిదే కానీ ఇలాంటి పెద్ద సినిమాకు మాత్రం కాస్త రిస్క్ తో కూడకున్న పని. జనాలు ఎలా రిసీవ్ చేసుకుంటారు అనేది చూడాలి. ఇక ఈ సినిమా జులై 28వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. బ్రో సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మిస్తున్న థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ మూవీ ఓవర్సీస్ బిజినెస్ భారీగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. శాటిలైట్ రేట్స్ ని భారీ రేటుకు కొనుగోలు చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఈ హక్కులను జీ తెలుగు సంస్థ రూ. 20 కోట్లకు సొంతం చేసుకుందట. ఇందుకోసం సదరు సంస్థ ఏకంగా కొన్ని కోట్ల రూపాయలను చెల్లించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈ సినిమాకి సముద్రఖని దర్శకత్వం వహిస్తున్నారు. తమిళ హిట్ మూవీ వినోదయ సీతం కి రీమేక్ గా తెరకెక్కుతోంది. అయితే పవన్ తేజ్ ఈమేజ్ కి తగినట్లు కథలో మార్పులు చేశారు ఈ మూవీలో కేతికా శర్మ ప్రియా ప్రకాష్ వారియర్ బ్రహ్మానందం రాజా చెంబోలు తనికెళ్ళ భరణి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## కీర్తి బేబీ ఇంతలా మారిపోయిందేంటి...

టాలీవుడ్ స్టార్ హీరోయిన్లలో కీర్తి సురేష్ ఒకరు. ఆమె తన అందం నటన తో ఎవరినైనా ఆకట్టుకుంటుంది. ఓ వైపు హీరోల సరసన నటిస్తూనే మరో వైపు హీరోయిన్ ఓరియంటెడ్ సినిమాల్లోనూ నటిస్తోంది. ఇటీవల దసరా సినిమా లో వెన్నెల పాత్రలో అదరగొట్టింది. డీ గ్లామర్ లుక్ లో కూడా అందంగా కనిపించింది. ఆమె అందానికీ నటన కు అందరూ ఫిదా అయిపోయారు. ఆ పాత్రలో కీర్తి కాకుండా మరెవరూ ఇంత అద్భుతంగా నటించరేమో అన్నట్లుగా నటించింది. ఇక ఈ దసరా మూవీ రూ.100కోట్ల క్లబ్ లో కూడా చేరిపోయింది.



కాగా కీర్తి సోషల్ మీడియా లోనూ ఎప్పుడూ చురుకుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన ఫోటోల ను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా తన స్నేహితులతో కలిసి ఆమె వీకెండ్ ని ఎంజాయ్ చేస్తున్న ఫోటోల ను షేర్ చేసింది. వైట్ కలర్ డ్రెస్ లో మెస్సీ హెయిర్ తో ఉన్న ఫోటోని తన అభిమాను లతో పంచుకుంది. ఈ ఫోటోలు ఇప్పుడు ఫ్యాన్స్ ని ఆకట్టుకుంటున్నాయి. ఆమె ముంబయి లోని ఓ రెస్టారెంట్ లో కలిసి ఫ్యాన్స్ తో ఎంజాయ్ చేసిన ఫోటోల ను షేర్ చేసింది. వీకెండ్ వైబ్స్ అంటూ క్యాప్షన్ పెట్టింది. కాగా దీని పై నెటిజన్లు ఆసక్తికర కామెంట్స్ చేస్తున్నారు. 'చందమామ ఆకాశం లో ఉందని రాకెట్ వేసుకొని వెళ్తున్నారు. కానీ నా చందమామ ముంబయి లో ఉంది' అంటూ ఓ నెటిజన్ కామెంట్ పెట్టడం విశేషం. అయితే ఈ ఫోటోల్లో కీర్తి కొంచెం క్లీవేజ్ షో చేయడం గమనార్హం. అది కొందరికి బాగా నచ్చగా కొందరు మాత్రం దాని ని విమర్శించడం గమనార్హం. తాము పాత కీర్తిని మిస్ అవుతున్నామని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇంకొందరు కీర్తి చాలా కష్టపడి ఈ స్థాయికి ఎదిగింది అంటూ ఆమె గొప్పతానన్ని కీర్తిస్తున్నారు. ఇదిలా ఉండగా కీర్తి చిరంజీవి భోళా శంకర్ లో నటించింది. ఆమె చిరుకి సోదరి పాత్రలో నటించారు. ఈ మూవీ వచ్చే నెల ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మరో వైపు నాగ చైతన్య కొత్త సినిమా లోనూ ఆమె హీరోయిన్ గా నటిస్తోందని సమాచారం.

## నందిత శ్వేత లిప్ లాక్ లు ధారాళంగా!

ఎక్కడికి పోతావు చిన్నవాడ సినిమాతో టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన కన్నడ బ్యూటీ నందిత శ్వేత సుపరిచితమే. ఆ తర్వాత శ్రీనివాసకళ్యాణం.బ్లప్ మాస్టర్ లాంటి చాలా చిత్రాలు చేసింది. కానీ ఏవి అమ్మడిని విజయ మార్గంలో నడించలేదు. అయినా అడపా దడపా సినిమాల్లో నటిస్తూ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తుంది. మరోవైపు టీవీ ప్రోగ్రామ్స్ కి హోస్ట్ గానూ పనిచేస్తూ టాలీవుడ్ కి రెగ్యులర్ గా టచ్ లో ఉంటుంది. అయితే కన్నడ బ్యూటీలు అందరి తరహాలోనే అమ్మడు తొలి నుంచి మడికట్టుకునే ఉంది. డీసెంట్ పాత్రలు తప్ప బోల్డ్ అటెంప్ట్ చేసింది లేదు. ఆ రకంగా కాస్త వెనుకబడి ఉంది ఇంతకాలం. అయితే ఇప్పుడా ఆలోచన మానుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా నటిస్తోన్న హిడింబ సినిమాలో హద్దులు చెరిపేసిన



నటించినట్లు తెలుస్తోంది. ఇందులో అశ్విన్ బాబు హీరోగా నటిస్తున్నాడు. త్వరలో ప్రేక్షకుల ముందుకొస్తున్న నేపథ్యంలో నందిత సినిమా విశేషాలు పంచుకుంది. ఈ సందర్భంగా తన పాత్ర ఎలా ఉంటుందన్నది రివీల్ చేసింది. ఈ సినిమాలో రొమాంటిక్ సన్నివేశాల్లో నటించాను. ఇంతకాలం ఆ తరహా సన్నివేశాలకు దూరంగా ఉన్నాను. కానీ ఈ సినిమాలో స్టోరీ డిమాండ్ చేయడంతో ముద్దు సన్నివేశాల్లో నటించాను. నటిగా నాలో కొత్త కోణం ఈ సినిమాలో కనిపిస్తుంది. ఈ సినిమా కోసం బరువు కూడా బాగా తగ్గాల్సి వచ్చింది. అందుకోసం నేను చాలా కష్టపడాల్సి వచ్చింది. ఎందుకంటే నాకు ఫైబ్రోమయోల్జియా అనే కండర రుగ్మత ఉంది. దాని వల్ల ఎక్కువ డైట్ పాటిస్తూ భారీ వ్యాయామాలు చేయడం సాధ్యం కాదు. మితి మీరిన ఒత్తిడి.. సరిగ్గా నిద్రలేకపోవడం వంటి కారణాల వల్ల ఇది తీవ్రతరం అవుతుంది. కానీ ఈ సినిమా కోసం ఆ సవాళ్లు అన్నింటిని ఎదుర్కొన్నాను. అనుకున్నట్లు వెయిట్ తగ్గాను. కానీ అది అలా ఉండిపోదు. మళ్లి పెరిగిపోవడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది అని తెలిపింది.




## టిఫిన్ బైఠక్ సమావేశాలను లైట్ తీసుకున్న టీబీజేపీ నేతలు.. కిషన్ రెడ్డి అధ్యక్షుడయ్యాక..

హైదరాబాద్ : టిఫిన్ బైఠక్ సమావేశాలను కమలం పార్టీ నేతలు లైట్ తీసుకున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆదివారం టిఫిన్ బైఠక్ సమావేశాలను బీజేపీ ఏర్పాటు చేసింది. 119కి గాను.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ముఖ్యనేతలు పాల్గొంటారని బీజేపీ ప్రకటించింది. కానీ రాష్ట్రంలో ఎక్కడా కూడా బీజేపీ టిఫిన్ బైఠక్ సమావేశాల హడావుడి కన్పించలేదు. అక్కడక్కడా ఆదివారం నామమాత్రంగా కార్యక్రమాలను పార్టీ నేతలు నిర్వహించారు. కిషన్ రెడ్డి అధ్యక్షుడైన తర్వాత జరిగిన మొదటి సమావేశాన్నే కమలం పార్టీ నేతలు లైట్ తీసుకోవడం గమనార్హం. నాయకుల తీరుపై కమలం పార్టీలో చర్చ జరుగుతోంది. అధ్యక్షుడి మార్పు తర్వాత కూడా కమలం పార్టీ నేతల్లో మార్పు కన్పించలేదు.

## మీకు అధికారం .. మంత్రి పదవి సోనియా గాంధీ పెట్టిన భిక్ష

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీపై మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు అర్ధరహితమని ప్రచార కమిటీకో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రాహుల్ గాంధీపై కేటీఆర్ వ్యాఖ్యలు అర్ధరహితమన్నారు. రాహుల్ గాంధీ పై విమర్శలు చేసే స్థాయి కేటీఆర్‌కు లేదన్నారు. రాహుల్ గాంధీని అనే ముందు .. కేటీఆర్‌కు వ్యవసాయం గురించి ఏం తెలుసో చెప్పాలన్నారు. ఒక వేలు రాహుల్ గాంధీ వైపు చూపిస్తే .. నాలుగు వేళ్లు మీ వైపు చూపుతున్నాయని తెలుసుకోవాలని పొంగులేటి హితవు పలికారు. రాహుల్ గాంధీపై కేటీఆర్ విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయని పొంగులేటి అన్నారు. రాహుల్ గాంధీకి అపారమైన విషయ పరిజ్ఞానం ఉందని.. భారత్ జోడో పాదయాత్రలో భాగంగా దేశంలో అన్ని వర్గాల ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకున్నారన్నారు. మీ ఫామ్ హౌస్‌లో క్యాప్సికమ్ పంటకు కోట్లు సంపాదించామని చెప్పిన మీరు.. మరి రాష్ట్రంలో రైతులకు ఆ ఫార్ములా ఏంటనేది ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. రాహుల్ పై విమర్శలు చేసే కేటీఆర్ ఏనాడైనా పాదయాత్ర చేశాడా? అని నిలదీశారు. మీకు అధికారం .. మంత్రి పదవి సోనియా గాంధీ పెట్టిన భిక్ష అని పొంగులేటి అన్నారు. సీఎం కేసీఆర్ ఓ మాయల మరాఠీ అని పొంగులేటి విమర్శించారు. ఉచిత విద్యుత్‌కు సంబంధించిన పేటెంట్ రైట్ కేవలం కాంగ్రెస్‌కే ఉందన్నారు. విద్యుత్‌పై బీఆర్ఎస్ మాటలను ప్రజలు విశ్వసించడం లేదన్నారు.



వైఎస్ హయాంలో ఉచిత విద్యుత్ ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను వక్రీకరించి పబ్బం గడుపుకోవాలని కేటీఆర్ చూస్తున్నారన్నారు. తనకు ప్రచార కమిటీకో చైర్మన్ పదవి ఇచ్చినందుకు అధిష్టానానికి రాష్ట్ర పీసీసీ, సీఎల్పీ సహా ముఖ్య నేతలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీలో అందరినీ కలుపుకొని పనిచేస్తానన్నారు. సీనియర్ల సలహాలు సూచనలతో ముందుకు వెళతానని.. పార్టీ ఏ గీత గీస్తే దాన్ని శిరసావహిస్తానని పొంగులేటి తెలిపారు.




## సీఎం కేసీఆర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే..!

భద్రాద్రి కొత్తగూడెం: ముఖ్యమంత్రి కేసీఅర్‌పై భద్రాచలం ఎమ్మెల్యే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గోదావరి వరద భాదితులకు ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో సీఎంపై భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. గత ఏడాది జూలై 17న సీఎం కేసీఅర్ భద్రాచలంలో పర్యటించారు. గోదావరి వరద గండం నుంచి గట్టెక్కించేందుకు భద్రాచలం వద్ద రూ. వెయ్యి కోట్లతో కరకట్ట నిర్మాణం చేస్తామని ముఖ్యమంత్రి వాగ్దానం చేశారు. లోతట్టు కాలనీలైన సుభాస్ నగర్ ముంపు బాధితులకు మరోచోట డబుల్ బెడ్ రూం ఇళ్ళు నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. నేటికీ ఏడాది గడిచినా సీఎం కేసీఅర్ మాట తప్పడంతో ఎమ్మెల్యే పోదెం వీరయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అసలు కేసీఆర్ ఎక్కడి నుంచి వచ్చారంటూ.. కేటీఆర్‌కు జీవన్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్

జగిత్యాల : మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఇటీవలి కాలంలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి టీడీపీ అధినేత చంద్రబాబును జత చేస్తూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జీవన్‌రెడ్డి.. కేటీఆర్‌పై విమర్శల వర్షం కురిపించారు. "నీ పోచారం శ్రీనివాసరెడ్డి చంద్రబాబు పంచన లేదా? నీ దయాకర్ రావు చంద్రబాబు పంచన లేదా? నీ తలసాని శ్రీనివాస్ యాదవ్ చంద్రబాబు పంచన లేదా? గంగుల కమలాకర్ ది ముందు టీడీపీ కాదా? బాబూ కేసీఆర్ అసలు నువ్వు ఎక్కడి నుంచి వచ్చావు? రేవంత్ రెడ్డి గురించి తెలుసుకుని మాట్లాడండి. చంద్రబాబు దయా దక్షిణ్యాలతోనే బీఆర్ఎస్ నేతలకు రాజకీయ భిక్ష. నీ మంత్రి వర్గం మొత్తం టీడీపీలోనే పుట్టింది. రాహుల్‌కు నీలాగా వాస్తవాలను వక్రీకరించడం రాదు. నువ్వా రాహుల్



గాంధీ గురించి మాట్లాడేది..? మేము ఉచిత విద్యుత్ ఇచ్చినప్పుడు నీ బతుకు దెరువు ఏంది కేటీఆర్? కాంగ్రెస్ ఆందోళనతోనే మూడు రోజులుగా 24 గంటలు ఇస్తున్నారు. ఆ సోయి మొన్నటిదాకా ఎందుకు లేదు కేటీఆర్?" అని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు.

## యాదాద్రీశ్వరుడిని దర్శించుకున్న కెనడా కార్మిక శాఖ మంత్రి దీపక్ ఆనంద్



యాదాద్రి: యాదగిరిగుట్టలోని యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని కెనడా కార్మిక శాఖ మంత్రి దీపక్ ఆనంద్ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా యాదాద్రికి చేరుకున్న కెనడా మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న దీపక్ ఆనంద్ దంపతులు.. నారసిం హునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు వారికి స్వామివారి తీర్థప్రసా దాలు, వేదాశీర్వాదం అందించారు. ఆలయ ప్రాంగణంలో కలియతిరిగిన మంత్రి.. క్షేత్ర నిర్మాణాన్ని పరిశీలించారు. కాగా, ఆషాఢ బోనాల సదర్భంగా హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని టీ హబ్‌లో మంత్రి దీపక్ ఆనంద్, ఆయన సతీమణి అరుణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో ఐటీ ఉద్యోగులతో కలిసి పాల్గొన్నారు.




హైదరాబాద్ : శామీర్ పేట ఓఆర్ఆర్‌పై నేటి తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఔటర్ రింగ్ రోడ్డుపై లియోనియా రిసార్ట్ వద్ద లారీ అదుపు తప్పి డివైడర్ దాటి ఒక కారుతో పాటు మరో వాహనాన్ని ఢీకొట్టింది. కారులో ముగ్గురు వ్యక్తులు ఉండగా అందులో ఇద్దరు మృతి చెందగా.. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇక లారీలో ఉన్న ఇద్దరు వ్యక్తులలో క్లీనర్ మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మేడ్చల్ నుంచి కీసర వెళ్తున్న లారీ వాహనాలను ఢీ కొని చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.




భోపాల్: వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నుంచి దిల్లీ వెళ్తున్న ఈ రైల్లో మంటలు చెలరేగాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అధికారులు అప్రమత్తమవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. రాణి కమలాపతి – హజ్రత్ నిజాముద్దీన్ వందే భారత్ రైలు సోమవారం తెల్లవారుజామున 5.40 గంటల ప్రాంతంలో భోపాల్ నుంచి బయల్దేరింది. ఉదయం 6.45 గంటల ప్రాంతంలో సీ–12 బోగీ చక్రాల్లో నుంచి పొగలు రావడాన్ని రైల్వే సిబ్బంది గుర్తించారు. వెంటనే రైలును విదిశ జిల్లాలోని కుర్వాయ్ – కేథోరా స్టేషన్ల మధ్య నిలిపివేసి తనిఖీ చేయగా.. బ్యాటరీ బాక్సుల్లో మంటలు చెలరేగినట్లు తెలిసింది. అప్రమత్తమైన రైల్వే సిబ్బంది వెంటనే ప్రయాణికులను దించేశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదని రైల్వే అధికారులు వెల్లడించారు. మంటలు బ్యాటరీ బాక్స్‌కు మాత్రమే పరిమితమయ్యాయని.. వాటిని పూర్తిగా అదుపు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రైల్వే సిబ్బంది రైలుకు మరమ్మతులు చేస్తున్నారని పేర్కొన్నారు.

సాంకేతిక తనిఖీలు పూర్తి చేసిన అనంతరం రైలు దిల్లీ బయల్దేరుతుందని చెప్పారు. ఘటన సమయంలో సీ–12 బోగీలో 36 మంది ప్రయాణికులున్నారు. మధ్యప్రదేశ్‌లో అందుబాటులోకి వచ్చిన మొదటి వందే భారత్ రైలు ఇదే. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ దీన్ని ప్రారంభించారు.




క్రిమియా ద్వీపకల్పాన్ని రష్యా ప్రధాన భూభాగంతో కలిపే కెర్చ్ వంతెనపై మరోసారి భారీ పేలుళ్లు జరిగాయి. దీంతో ఈ వంతెనపై రాకపోకలను రష్యా నిలిపివేసింది. సోమవారం ఉ. 3 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకొంది. రష్యా ఆధీనం లోని క్రిమియా రిపబ్లిక్ అధ్యక్షుడు సెర్గీ అక్సోనోవ్ స్పందిస్తూ.. అత్యవసర పరిస్థితి కారణంగా ఈ వంతెనపై రాకపోకలను నిలిపివేశామని తెలిపారు.

**తెల్లవారుజామున రెండు పేలుళ్లు..** సోమవారం తెల్లవారు జామున 3.00–3.30 మధ్యలో కెర్చ్ వంతెనపై రెండు పేలుళ్లు జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. దీంతో రష్యా అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. చాలా మంది వంతెనపై చిక్కుకుపోయినట్లు సమాచారం. పేలుళ్ల వల్ల కనీసం ఇద్దరు చనిపోయినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని రష్యా ధ్రువీకరించలేదు. తాజా పేలుళ్ల వల్ల క్రిమియా వంతెనలో కొంత భాగం దెబ్బతిన్నట్లు గ్రేజోన్ అనే వాగ్నర్ అనుకూల టెలిగ్రామ్ ఛానల్ పేర్కొందని సీఎన్ఎన్ వెల్లడించింది. రష్యా వైపు నుంచి 145వ పిల్లర్ వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

**పుతిన్ కలల వంతెన పేల్చివేత వెనక మాస్టర్ ప్లాన్..?** క్రిమియా వంతెన దెబ్బతిన్న విషయాన్ని రష్యా రవాణా శాఖ కూడా ధ్రువీకరించింది. "క్రిమియా వంతెన రోడ్డు మార్గంలో కొంత భాగం దెబ్బతింది" అని టెలిగ్రామ్ ఛానల్‌లో పేర్కొంది. ఎంత దెబ్బతిందో మాత్రం వెల్లడించలేదు.

**క్రిమియాకి జీవనాడి :** క్రిమియాకు నిత్యావసరాల సరఫరాలో, యుద్ధ రంగంలోని రష్యా బలగాలకు ఆయుధాలను చేరవేయడంలో 19 కి.మీ. పొడవైన కెర్చ్ వంతెన ఎంతో ముఖ్యమైనది. రైళ్లు, వాహనాల రాకపోకల కోసం నిర్మించిన జంట వారధి ఐరోపాలోనే అత్యంత పొడవైనది. నల్ల సముద్రంపై ఆధిపత్యం కోసం తీవ్రంగా యత్నిస్తోన్న రష్యా.. 2014లో క్రిమియా ద్వీపాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత సుమారు రూ.29వేల కోట్లు (360 కోట్ల అమెరికన్ డాలర్లు) వెచ్చించి రోడ్డు, రైలు వంతెనను నిర్మించింది. 2018లో పుతిన్ స్వయంగా ట్రక్ నడిపి దీనిని ప్రారంభించడం విశేషం. గత అక్టోబర్‌లో పుతిన్ 70వ జన్మదిన వేడుకలు జరిగిన మరుసటి రోజే బ్రిడ్జిపై దాడి జరిగింది. అప్పట్లో ఉక్రెయిన్ అత్యాధునిక సముద్ర డ్రోన్‌లో పేలుడు పదార్థాలు నింపి ఈ వంతెన కింద పేల్చినట్లు తెలుస్తోంది. కొన్ని మైళ్ల దూరం నుంచి సెన్సర్లు, రిమోట్ సాయంతో అప్పట్లో ఈ దాడి చేసినట్లు భావిస్తున్నారు.

## శామీర్ పేట కాల్పుల ఘటనలో కీలక మలుపు!

హైదరాబాద్ నగర శివార్లలోని శామీర్ పేటలో కాల్పుల ఘటన కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి రావడంతోపాటు... పేరు విషయంలో ఒక బిగ్ ట్విస్ట్ జరిగిందని తెలుస్తుంది. అవును... శామీర్ పేట కాల్పుల ఘటనకు సంబంధించి పోలీసుల రిమాండ్ రిపోర్టులో పలు విషయాలు వెల్లడయ్యాయని తెలుస్తుంది. ఇందులో భాగంగా... తన బంధానికి అడ్డొస్తున్నాడనే ఉద్దేశంతో సిద్ధార్థ దాస్ ను హతమార్చేందుకు.. సినీ నటుడు మామిడి మనోజ్ కుమార్ నాయుడు అలియాస్ సూర్యతేజ ప్రయత్నించాడని పోలీసులు నిర్ధారించారని అంటున్నారు. వివరాల్లోకి వెళ్తే... ఏపీలోని విశాఖపట్నానికి చెందిన సిద్ధార్థ దాస్(49) ఒడిశా రాష్ట్రంలోని బరంపూర్ కు చెందిన స్మిత గ్రంథికి 20 ఏళ్ల క్రితం వివాహం జరిగిందట. వీరికి కుమారుడు(17) కుమార్తె(13) ఉన్నారని తెలుస్తుంది. అయితే 2019లో మనస్పర్ధలతో స్మిత విడాకులకు దరఖాస్తు చేశారని తెలుస్తుంది. ఆ సమయంలో వారు మూసాపేటలో నివాసముండేవారట. అనంతరం ఇద్దరు పిల్లలతో ఒంటరిగానే ఉంటున్న స్మిత... మానసిక సమస్యలకు కౌన్సిలింగ్ ఇచ్చేవారట. అదే సమయంలో విజయనగరం జిల్లా రాజాంకు చెందిన మనోజ్.. ఫేస్ బుక్ ద్వారా స్మితను సంప్రదించి కౌన్సిలింగ్ తీసుకున్నాడని అంటున్నారు. ఈ క్రమంలోనే స్మిత తన వ్యక్తిగత జీవితాన్ని కూడా మనోజ్ తో పంచుకున్నారని.. అనంతరం ఇద్దరూ దగ్గరయ్యారని తెలుస్తుంది. ఈ సమయంలో ఇద్దరూ కలిసి వ్యాపారం కూడా చేసుకుంటూ ఒకే ఇంటిలో ఉన్నారని తెలుస్తుంది. ఇదే సమయంలో స్మిత ఇద్దరు పిల్లల చదువుల విషయంలో మనోజ్ కాస్త కఠినంగా వ్యవహరించేవాడని తెలుస్తుంది. ఇందులో భాగంగా... స్మిత కుమారుడు ఇంటర్ లో ఫెయిలయ్యాడని మనోజ్ కొట్టాడని.. ఫలితంగా స్మిత కుమారుడు ఇంటి నుంచి వెళ్లిపోయి స్నేహితుల దగ్గర ఉంటున్నాడని అంటున్నారు. ఈ క్రమంలో... తనను మనోజ్ వేధిస్తున్నాడంటూ బాలల సంరక్షణ కమిటీకి జులై 12న స్మిత కుమారుడు ఫిర్యాదు ఇచ్చాడట. తన చెల్లిల్ని కూడా వేధిస్తున్నారని తన తండ్రికి సీడబ్ల్యూసీకి కూడా చెప్పాడని తెలుస్తుంది. ఈ క్రమంలోనే కుమార్తెను చూసేందుకు విశాఖలో ఉంటున్న సిద్ధార్థదాస్ శామీర్ పేటలో స్మిత మనోజ్ ఉండే నివాసానికి వెళ్లాడట. దీంతో... సిద్ధార్థను హతమార్చి తమ బంధానికి అడ్డుతొలగించుకోవాలని మనోజ్ నిర్ణయించుకున్నాడని చెబుతున్నారని సమాచారం. ఆ సంగతి అలా ఉంటే... ఈ సంఘటన జరిగిన వెంటనే "నటుడు మనోజ్ నాయుడు" అనే విషయంలో కొన్ని మీడియా ఛానళ్లు కన్ ఫ్యూజన్ లో పడ్డాయని తెలుస్తుంది. ఇందులో భాగంగా... "కార్తీక దీపం" యాక్టర్ మనోజ్ కుమార్ ఎవరిపైనో కాల్పులు చేశాడంటూ అతని ఫోటోలు వీడియోలతో న్యూస్ వైరల్ అయ్యింది. అయితే ఆ మనోజ్ వేరు ఈ మనోజ్ వేరనే విషయంపై స్పష్టత ఇచ్చారు కార్తీక దీపం మనోజ్! అవును... "కార్తీక దీపం"లో ప్రేమ్ గా ఇప్పుడు "మౌన పోరాటంలో ద్వారక" లోనూ నటిస్తున్న తాన పేరు కూడా మనోజ్ నాయుడే అని తెలిపిన ఆయన... అయితే శామీర్ పేటలోని కాల్పుల ఘటనలో నిందితుడిగా చెబుతున్న మనోజ్ నాయుడు తాను కాదని తాను బెంగళూరులో ఉంటే ఈ విషయం తెలిసిందని ఆన్ లైన్ వేదికగా స్పందించారు. అయితే అసలు నిందితుడిగా చెబుతున్న మనోజ్ నాయుడు అలియాస్ సూర్యతేజ... "శంబో శివ శంభో" సినిమాలో రవితేజ – నరేష్ లకు స్నేహితుడిగా నటించిన వ్యక్తి అని తెలుస్తుందని అంటున్నారు!!

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com